ప్రజాశక్తి

శుక్రవారం 8 నవంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

సెల్‌లో అపార్ వివరాలు నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

అపార్ అవస్థలు

- ఆధార్‌లో తప్పులు దొర్లినచోట విద్యార్థుల పాట్లు
- ఉపాధ్యాయులపై ఐడి నమోదు భారం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

వన్ నేషన్ - వన్ స్టూడెంట్ పేరుతో ఒకటి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) ఐడి కోసం కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కొత్త అవస్థలు తెచ్చిపెట్టింది. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో ఛైల్డ్ ఐడి, జాతీయ స్థాయిలో పెన్ ఐడి ప్రతి విద్యార్థికీ ఉన్నాయి. ఇవి కాకుండా ప్రతి విద్యార్థికీ అపార్ ఐడిని కేంద్రం తప్పనిసరి చేయడంతో కంప్యూటర్లు లేని పాఠశాలల్లో ఉపాధ్యాయులు తమ సెల్ నుంచి పాఠశాలల్లోని విద్యార్థుల రికార్డుల్లో వివరాలను, ఆధార్‌లోని సమాచారాన్ని నమోదు చేస్తున్నారు. పాఠశాల రికార్డుల్లోని వివరాలకు, ఆధార్‌లోని పేర్లు, పుట్టిన తేదీకి తేడావుంటే ఆన్‌లైన్‌లో నమోదుకావడంలేదు. కొన్ని పాఠశాలలకు ఇంటర్నెట్ అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు తలెత్తడంతో విద్యాశాఖాధికారులు ఎంత ఒత్తిడి తెచ్చినా ఉపాధ్యాయులకు ఈ నమోదు తలనొప్పిగానే మారింది.

జిల్లాలో కె.కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థి సుధీర్ పేరు ఆధార్‌లోని అక్షర క్రమంలో చివరన 'ఆర్' బదులు 'బి' వుంది. సుధీర్ బదులు సుధీబ్ అని ఆధార్‌లో వుండడంతో ఆధార్‌లోని పొరపాటును సరిచేసుకొని తిరిగి ప్రధానాపోధ్యాయురాలికి ఇవ్వాల్సివచ్చింది. ఆధార్‌లో పొరపాట్లు సరిచేయడానికి కనీసం పది రోజులు పడుతోంది. అందుబాటులో ఆధార్ కేంద్రాల్లేని విద్యార్థులు తమ తల్లిదండ్రులను తీసుకొని ఆధార్ వున్నచోటకు వెళ్లాల్సివస్తోంది. సాంకేతిక కారణాలతో నమోదు వేగంగా జరగకపోవడంతో బోధన కుంటుపడుతోంది. ఆధార్‌లోని లోపాలు సరిదిద్ది అపార్ నమోదు వేగవంతంగా జరిగేలా ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలను విద్యాశాఖ ఏర్పాటుచేయలేదు. నవంబరు నాటికి నమోదు పని పూర్తిచేయాలని మిగతా 2లో..

కుంటుపడుతున్న బోధన

అపార్ వివరాల నమోదు బాధ్యతను ఉపాధ్యాయులకు అప్పగించడంతో బోధన కుంటుపడుతోంది. బోధనేతర పనులు ఉపాధ్యాయులకు అప్పగించవద్దని చెప్పినా ఏ ప్రభుత్వమూ పట్టించుకోవడంలేదు. బోధనేతర పనులకు ప్రత్యేకంగా సిబ్బందిని నియామకంచేసి వారితో చేయించాలి. ఉపాధ్యాయుల విలువైన సమయాన్ని బోధనేతర పనులకు ఉపయోగిస్తే నాణ్యమైన విద్యా బోధనపై ప్రభావం పడుతుంది.

గొంది చినబ్బాయ్, యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు కుమార్, గంగారావు తదితరులు

నేటి నుంచి సిపిఎం ప్రజాపోరు

జయప్రదం చేయాలని నాయకుల పిలుపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం నుంచి సిపిఎం ప్రజాపోరు కార్యక్రమాన్ని చేపట్టినట్టు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. విశాఖ జిల్లాలో ఈ నెల 8 నుంచి 14 వరకు ప్రజాపోరు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గురువారం సాయంత్రం జగదాంబ దరి పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ బి.గంగారావు, బి.జగన్, పి.మణి, వి.కృష్ణారావులతో కలిసి ప్రజాపోరు పోస్టర్ ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బిజెపి, రాష్ట్ర టిడిపి కూటమి ప్రభుత్వాలు ధరలను అదుపు చేయడానికి ఎటువంటి చర్యలూ చేపట్టలేదన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చర్యలను వేగవంతం చేయడంతో పాటు విద్యుత్ భారాలను భారీగా మోపుతున్నారన్నారు. ఉచిత ఇసుక విధానం అమలు, ఖాళీ పోస్టుల భర్తీ, కాంట్రాక్ట్ కార్మికుల పర్మినెంట్ కోసం, లేబర్ కోడ్స్ రద్దు కోసం ఈ ప్రజాపోరు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం నుంచి ఈ నెల 14 వరకు ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ, పాదయాత్రలు, గ్రూపు మీటింగులు, సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. 14న తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

29న విశాఖ డెయిరీ ముట్టడి

▶ వార్త 6లో..

రైతు బజార్ల ఏర్పాటుకు కృషి

▶ వార్త 6లో..

రమేష్ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తాం

▶ వార్త 5లో..

సమావేశంలో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

'ఉక్కు'పై చేతులెత్తేసిన బాబు

వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్, ఎంపీ విజయసాయి రెడ్డి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ ఉక్కు విషయంలో సిఎం చంద్రబాబు చేతులెత్తేసారని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్, ఎంపీ విజయసాయి రెడ్డి అన్నారు. రీజనల్ కో-ఆర్డినేటర్‌గా పార్టీ అధిష్టానం నియమించిన తర్వాత ఆయన విశాఖలో తొలి సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ అధ్యక్షతన ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ మిగతా 2లో..

పోర్టు హాస్పిటల్

పిపిపి టెండర్లు నేడు ఓపెన్

- ఆసుపత్రి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న ఉద్యోగ, కార్మిక సంఘాలు
- 39 రోజులుగా పోరాటం
- ఛైర్మన్ చాంబర్ వద్ద నేడు అఖిలపక్షం ధర్నా

దీక్షల్లో కూర్చున్న పోర్టు కార్మికులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

40 వేల మంది పోర్టు ఉద్యోగులు, కార్మికులు, అధికారులు, విశ్రాంత ఉద్యోగులకు, వారి కుటుంబీకులకు సేవలందిస్తున్న పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) పేర ప్రైవేట్ ఆపరేటర్ చేతిలో పెట్టేందుకు పిలిచిన టెండర్లను శుక్రవారం ఓపెన్ చేయనున్నారు. పిపిపిలో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చి 300 పడకలకు పెంచాలన్నది పోర్టు విధానంగా ఉంది. ప్రైవేట్‌వారి చేతికి వెళ్లాక కార్మిక, ఉద్యోగ సంక్షేమం ఇంకెక్కడుంటుంది ? అన్నది ఉద్యోగులు, అధికారుల ఆందోళన. ఈ నేపథ్యంలోనే టెండర్లను పూర్తిగా రద్దు చేయాలంటూ వారంతా డిమాండ్ చేస్తున్నారు. గడచిన 39 రోజుల నుంచీ ఉద్యోగ, కార్మిక సంఘాలన్నీ పోర్టు ఆసుపత్రి ఆస్తులు, స్థలాలను పిపిపికి ఇచ్చే పోర్టు విధానంపై పోరాడుతున్నాయి. గురువారం పోర్టు ఎఒబి వద్దగల ఛైర్మన్ చాంబర్ వద్ద ధర్నాకు అఖిలపక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. శుక్రవారమే పోర్టు ఉన్నతాధికారులు కొలువు దీరేటి బోర్డు మీటింగ్‌ను విశాఖ పోర్టు ట్రస్ట్ (విపిటి) ఛైర్మన్ అంగముత్తు నిర్వహిస్తుండడంతో కార్మిక సంఘాల ధర్నాకు ప్రాధాన్యత ఏర్పడింది. టెండర్లు ఓపెన్ చేస్తున్నందున ఛైర్మన్ కార్యాలయం వద్దనే సిఐటియు, ఇతర కార్మిక సంఘాలు తేల్చుకోవాలని నిర్ణయించాయి.

పిపిపి, బిఒటి విధానాలు సక్సెస్ అయ్యాయా ?

విశాఖ పోర్టులో ఇప్పటికే 10కి పైగా బెర్తులు పిపిపిలోకి వెళ్లిపోయాయి. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, కళావాణి ఆడిటోరియాన్ని ప్రైవేట్ వాళ్ల చేతుల్లో పోర్టు పెట్టింది. పోర్టు ఆసుపత్రిని తాజాగా ప్రైవేటుకు సిద్ధం చేస్తున్నారు. పిపిపి, ప్రైవేట్ ఏదైనా సరే పోర్టులో ఒక విఫల ప్రయోగమే అన్నది గతంలోనే 'కాగ్' నివేదిక స్పష్టంగా వెల్లడించింది. వారికి లాభాలు మినహా ఉద్యోగ, కార్మిక ప్రయోజనాల విషయంలో ప్రారంభంలో కొంత శ్రద్ధ చూపినా క్రమంగా ఒప్పందాలను ఉల్లంఘించిన దాఖలాలు అనేకం ఉండడంతో కాగ్ తప్పుపట్టింది. ప్రతి ఏటా సరుకు రవాణాలో విశాఖ పోర్టు గణనీయ ప్రగతిని సాధిస్తూ రూ.వందల కోట్లు వ్యాపార లాభాలను ఆర్జించడంలో శక్తివంచన లేకుండా ఉద్యోగులు, కార్మికులు శ్రమిస్తున్నారు. వారి సంక్షేమాన్ని పోర్టు యాజమాన్యం చూడాలన్న డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది.

మొదటి పేజీ తరువాయి..

అపార్ అవస్థలు

విద్యాశాఖాధికారులు ఒత్తిడి తేవడంతో బోధన కంటే బోధనేతర అపార్ నమోదులో ఉపాధ్యాయులున్నారు. తొందరగా విద్యార్థుల వివరాలు నమోదుచేసి అపార్ ఐడి జనరేట్ చేసే పని ముగించి బోధన పనుల్లోకి తిరిగి రావాలని ఉపాధ్యాయులు చేస్తున్న ప్రయత్నాలకు సాంకేతిక కారణాలు అడ్డంకిగా మారాయి. దీంతో జిల్లాలో అపార్ నమోదు గురువారం ఉదయం నాటికి 58 శాతం అయింది.

జిల్లాలోని 24 మండలాల్లో 1960 ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలున్నాయి. వీటిలో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులు 2,55,806 మంది చదువుతున్నారు. అందులో 1,48,443 మంది విద్యార్థుల అపార్ వివరాలు నమోదయ్యాయి. ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులు 26,758 మంది వున్నారు. వీరిలో 6,901 మంది అపార్ నమోదు చేసుకున్నారు. ఇంటర్ విద్యార్థుల నమోదు 25.79 శాతం అయింది.

'ఉక్కు'పై చేతులెత్తేసిన బాబు

సమన్వయకర్తలతో ఈ సమావేశం సాగింది. ఈ సందర్భంగా విజయసాయి రెడ్డి మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణను చంద్రబాబు నాయుడు పూర్తిగా విస్మరించారన్నారు. లక్షల కోట్ల విలువ చేసే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని వేల కోట్లకు విక్రయించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. తాము మొదటి నుంచి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉన్నామని చెప్పారు. అమరావతిని అభివృద్ధి చేయడం కోసం ఉత్తరాంధ్రకు చంద్రబాబు అన్యాయం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. అందులో భాగంగానే ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయాన్ని విశాఖ నుంచి అమరావతికి తరలించే కుట్ర చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతుందని, భవిష్యత్తులో ఉత్తరాంధ్రలో నియోజకవర్గాల సంఖ్య 44 పెరుగుతుందని చెప్పారు. మహిళా కోటాతో పాటు రిజర్వేషన్లు పలుచోట్ల మారతాయని వివరించారు. ఈ పరిణామాలన్నింటినీ చర్చించుకుని రాబోయే ఎన్నికలకు సిద్ధమవుతామని తెలిపారు. తాము అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో కార్యకర్తలను నిర్లక్ష్యం చేసిన మాట నిజమేనని వెల్లడించారు. ఇప్పటి నుంచి కార్యకర్తల అభివృద్ధికి పాటు పడతామని చెప్పారు. సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సుభద్ర, శాసన సభ్యులు ఆర్.మత్స్యలింగం, శాసన మండలి సభ్యులు వరుదు కల్యాణి, రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, కన్నబాబు రాజు, కంబాల జోగులు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అదీప్ రాజు, చింతలపూడి వెంకట రామయ్య, భాగ్యలక్ష్మి, శోభా హైమావతి, సమన్వయకర్తలు కెకె.రాజు, మలసాల కిషోర్, పి.వరలక్ష్మి, నాయకులు రవి రెడ్డి, ఉరుకూటి అప్పారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్ సబ్సిడీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సబ్సిడీ సొమ్ము చెల్లించనున్నట్టు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. గ్యాస్ సబ్సిడీపై ప్రజలు ఆందోళన చెందవద్దని, ఇకెవైసి చేయడం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని తెలిపారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో దీపం పథకంపై ఆయన పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. పలు సందేహాలను నివృత్తి చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు అన్ని కేటగిరీలలో 93,784 మంది గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకున్నారని, 54,011 మందికి డెలివరీ జరిగిందని, వాటిలో అర్హులైన 37,385 మందికి రూ,3 కోట్లు దీపం పథకం కింద లబ్ధి చేకూరుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు అంపైర్‌గా శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ విశాఖపట్నంలో పనిచేస్తున్న డివిఎస్‌వై.శర్మను నవంబర్ 24 నుండి 29 వరకు చండీఘర్‌లో జరగనున్న 51వ ఆల్ ఇండియా ఇంటర్ ఇనిస్టిట్యూషనల్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ 2024కు ఇంటర్నేషనల్ బ్లూ బడ్జ్ అంపైర్‌గా ఎంపిక చేసినట్లు టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గానూ, విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగానూ ఉన్నారు. అంతేకాకుండా లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో ఆల్ ఇండియా స్పోర్ట్స్ ప్రమోషన్ మెంబర్‌గా ఎల్ఐసి క్రీడలకు ఆయన ప్రచారం చేస్తున్నారు

అభివృద్ధి పనులపై విఎంఆర్‌డిఎ కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ గురువారం జోన్ల వారీగా అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. హెల్త్ ఎరీనా, సెంట్రల్ పార్క్, సీ హ్యారియర్, చిల్డ్రన్ ఎరీనా నిర్వహణ పనులను సమీక్షించి సాధ్యమైనంత త్వరగా మరమ్మతు పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా చీమలాపల్లి, ఎండాడ కన్వెన్షన్ సెంటర్ల పనుల పురోగతిని సమీక్షించారు. సమావేశంలో ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, కార్యనిర్వహక ఇంజినీర్లు ఎస్‌విఎస్ఎన్.రాజు, రామరాజు, సుధీర్, ఉపకార్యనిర్వాహక ఇంజినీర్లు, సహాయ ఇంజినీర్లు పాల్గొన్నారు.

డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులను అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కో-ఆర్డినేటర్ సతీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి అనుభవిజ్ఞులు అయిన ఉపాధ్యాయులతో కంచరపాలెంలోని బొట్టా నరసింగరావు ఫౌండేషన్ భవనంలో ఉచిత శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు 9347205549 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

హాస్టల్‌లో ఉండలేం.. ఇంటికి వెళ్లిపోతాం

గంజాయి స్మోకర్లతో భీతిల్లుతున్నాం

ఎస్ఎఫ్ఐ నాయకుల వద్ద నాతవరం ఎస్‌సి వసతిగృహ బాలికల ఆవేదన

ప్రజాశక్తి-నాతవరం : 'హాస్టల్‌కు కొంతమంది వచ్చి గంజాయి స్మోక్ చేస్తున్నారు. రాత్రిపూట భయమేస్తోంది. బాత్రూంలు మాతో కడిగిస్తున్నారు. వాటికి బల్బులు లేవు. పదో తరగతి పరీక్షలు దగ్గరకొస్తున్నాయి. ఇలా వుంటే ఎలా చదువుతాం. టిఫిన్‌లో పురుగులు వుంటున్నాయి. స్నాక్స్ వుడకడంలేదు. ఇక్కడ వుండలేం. ఇంటికి వెళ్లిపోతాం' అని నాతవరం ఎస్‌సి బాలికల వసతి గృహ విద్యార్థులు ఎస్ఎఫ్ఐ నాయకుల ముందు వాపోయారు. గురువారం వసతి గృహ సమస్యలను పరిశీలించడానికి వెళ్లిన నాయకులకు ఎంతోకాలంగా పడుతున్న బాధలను విద్యార్థులు వివరించారు. వార్డెన్‌ను మార్చాలని కోరారు. శుక్రవారం ఇంటికి వెళ్లిపోతామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాతవరం

ఎస్ఎఫ్ఐ నాయకులకు సమస్యలను వివరిస్తున్న విద్యార్థినులు

మండల కార్యదర్శి రాజు మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులపై దురుసుగా ప్రవర్తిస్తూ, స్నానపు గదులు కడిగిస్తున్న వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

విశాఖ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 19 నుంచి 21 వరకు నిర్వహించనున్న విశాఖ బాలోత్సవం పోస్టర్‌ను కన్సర్న్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ పికె.జోష్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశాఖ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు బాలోత్సవ కార్యక్రమ వివరాలను జోష్‌కు వివరించారు. విశాఖ బాలోత్సవాన్ని ఈ నెల 19, 20, 21 తేదీల్లో సెయింట్ ఆంథోనీ ప్రైమరీ స్కూల్లో నిర్వహిస్తున్నామని, ఇప్పటికే స్కూళ్లకు వెళ్లి పోటీల వివరాలున్న సెట్లను అందించామని, 9వ తేదీలోగా ఎంట్రీలను బాలోత్సవ కేంద్రానికి అందించాలని స్కూళ్లను కోరినట్లు తెలిపారు. బాలోత్సవం విజయవంతం కావడానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. అందుకు జోష్ సానుకూలంగా స్పందిస్తూ కోరిన సహాయ సహకారాలను తప్పక అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బాలోత్సవం ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు కె.రమాప్రభ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పికె.జోష్

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దనున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో హెచ్‌పిసిఎల్ సౌజన్యంతో ఇగ్నైట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రాం (ఐఐఎటిపి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండస్ట్రియల్ వెల్డర్, పైప్ ఫిట్టర్, ఫైర్ అండ్ సేఫ్టీ కోర్సుల్లో ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్, ఐటిఐ విద్యార్హత కలిగిన వారు ఈ నైపుణ్య శిక్షణ కోర్సుల్లో చేరడానికి అర్హులని పేర్కొన్నారు. వివరాలకు ఈ నెల 15లోగా 7981336432, 8374660705 నెంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

నిరాశ్రయులకు శాశ్వత భవనాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలో ఎయుటిడి నిర్వహిస్తున్న నిరాశ్రయుల షెల్టర్లకు శాశ్వత భవనాలను త్వరలో నిర్మించనున్నట్టు జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన టిఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ఎయుటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న నిరాశ్రయుల షెల్టర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌కు, బస్టాండ్‌కు అందుబాటులో ఉండే విధంగా ఎయుటిడి నిర్వహిస్తున్న షెల్టర్లు ఉన్న భవనాలు శిథిలావస్థకు చేరాయని తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రగడ వాసు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రాధాన్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూనే పారిశ్రామికవేత్తలకు సంపూర్ణ సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. విశాఖపట్నం అభివృద్ధికి ఇప్పటికే రోడ్ మ్యాప్ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా సానుకూల దృక్పథంతో ఉందని, కొద్ది రోజుల్లోనే కార్యాచరణ ప్రారంభ మవుతుందని చెప్పారు. కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం సాయంత్రం జరిగిన సిఐఐ 4వ జోనల్ స్థాయి సమావేశంలో ఆయన వివిధ అంశాలపై మాట్లాడారు. ఇటీవల ముఖ్యమంత్రి జిల్లా అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షలో ప్రధాన అంశాలను సిఐఐ సభ్యులకు వివరించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చే నాటికి జిల్లాలోని అన్ని అభివృద్ధి ప్రాజెక్టులు పూర్తి చేయాలని సిఎం చెప్పారని గుర్తు చేశారు. ఆ మేరకు విఎంఆర్‌డిఎ, జివిఎంసి సహాయంతో అభివృద్ధి పనులకు రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని, అతి త్వరలోనే కార్యాచరణ ప్రారంభమవుతుందని అన్నారు. కార్యక్రమంలో నగర సిపి శంఖబ్రత బాగ్చి, సిఐఐ ఎపి సెక్టార్ ఛైర్మన్ మురళీకృష్ణ, సిఐఐ విశాఖపట్టణం జోన్ ఛైర్మన్ గ్రంధి రాజేశ్ పాల్గొన్నారు. సిఐఐ ప్రతినిధులు తమ సలహాలు, సూచనలు అందించారు

IN THE HON'BLE COURT OF THE VI ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM
A.S.74/2024

Between:
Smt. J. Ratna Madhavi,
being rep. by her GPA holder
Sri P. Satyanarayana Murthy
... Appellant

And:
Sri C.D. Robinson (died) and others
...Respondents

NOTICE

To,
R-6: Sri Chintadripeta Jashuva Robinson, S/o. late C.D. Robinson, Christian, aged 57 years, R/at. D.No.20-70-55/1, Asipapa Street, Chengalaraopeta, Visakhapatnam.
R-7: Sri Chintadripeta Fransis Robinson, S/o. late C.D. Robinson, Christian, aged 57 years, Rest-do-

Whereas the Appellant herein filed above appeal against both of you, the Hon'ble Court was pleased to order notice to you in the above matter through this publication.The said appeal stands posted to **25-11-2024** for your appearance.You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **25-11-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence.

V. CHANDRA SEKHAR,
Advocate,
Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE V ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT: VISAKHAPATNAM
O.S.1325/2022

Between:
State Bank of India,SME Centre
Visakhapatnam,
Rep. by its Manager ...Plaintiff-Bank

And:
M/s. Sri Lakshmi Multi Car Works,
Proprietor Sri Mutyala Vara Prasad
& another ...Defendants

SUMMONS

To,
Defendant No.1:
M/s. Sri Lakshmi Multi Car Works,
Proprietor Sri Mutyala Vara Prasad,
Flat No.2-87/5, GITAM College Road,
Ward No.6, Yendada,
Visakhapatnam.

Please take notice that the above named plaintiff/Bank has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **29-11-2024** for your appearance.You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **29-11-2024 10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
S. SUDHEER REDDY,
Advocate
Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.822/2023

Between:
M/s. Aiswarya Irrigation Systems & Constructions,
Rep. by its Managing Partner
Sri Ronanki Vijaya Chandrudu
...Plaintiff

And:
Smt. Uppada Vara Lakshmi
...Defendant

SUMMONS

To, **The Defendant:**
Smt. Uppada Vara Lakshmi,
W/o. Devi Prasad,
D/o. Late Mutyam, Hindu,
aged 44 years, R/at D.No. 39-10-7,
Ayyappa Nagar, P. R. Gardens,
Visakhapatnam-07.

Please take notice that above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest costs and other reliefs and the suit stands posted to **29-11-2024** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **29-11-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
S.S. CHALAM,
Advocate, 104 Area,
Marripalem,Visakhapatnam.

శిథిల భవనంలో వసతి!

- పైకప్పు పెచ్చులూడిన గదుల్లో బిక్కుబిక్కుమంటున్న కాలేజీ విద్యార్థులు
- అరకొరగా స్నానపు గదులు, మరుగుదొడ్లు
- వార్డు సచివాలయం రెండో అంతస్తులో నిద్ర
- ఇదీ భీమిలి సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ దుస్థితి

భీమిలిలోని సాంఘిక సంక్షేమశాఖ కాలేజీ బాలుర హాస్టల్

ప్రజాశక్తి -భీమునిపట్నం :'దళితుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం' అంటూ పాలకులు చెప్పే మాటలకు, క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితి భిన్నంగా ఉంది. మాటలు కోటలు దాటుతున్నాయి. ఆచరణ గడప దాటడం లేదు అన్న చందాన పాలకుల విధానాలు ఉన్నాయి.

భీమిలిలోని ప్రభుత్వ డైట్‌కు సమీపాన సాంఘిక సంక్షేమ కళాశాల వసతి గృహం ఉంది. 1979లో నిర్మించిన ఈ భవనంలో కొన్నేళ్ల పాటు పాఠశాల విద్యార్థుల బాలుర వసతి గృహం నిర్వహించగా, 2017 నుంచి కళాశాల హాస్టల్‌గా కొనసాగుతోంది. ఇంటర్ మొదలు పీజీ వరకు చదివే విద్యార్థులు అరకొర సదుపాయాలు నడుమ శిథిలా వస్థకు చేరిన హాస్టల్ భవనంలో ఉంటున్నారు.

మరమ్మతుకు గురైన మరుగు దొడ్లు, స్నానపు గదులు

పెచ్చులూడిన భవనం...

ఇదే హాస్టల్ భవనంలో మూడు పెద్ద గదులు ఉన్నాయి. వీటిలో విద్యార్థులు పుస్తకాలు, బ్యాగ్‌లు, బెడ్ షీట్‌లు ఉంచుతారు. ఇక్కడే చదువుతున్నారు. వంట గది, ఆఫీస్ రూమ్, స్టోర్ రూం ఉన్నాయి. దాదాపు భవనం పై కప్పు, ఉండే గదులు పెచ్చులూడి ఉన్నాయి. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరడంతో క్షణక్షణం ప్రాణ భయంతో ఉండాల్సి వస్తోందని సమస్య తీవ్రతను సంబంధిత విద్యార్థులు, పలు ప్రజాసంఘాల నాయకులు గతంలో తహశీల్దార్, ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్లిన సందర్భాలు ఉన్నాయి. అనేక సందర్భాల్లో విద్యార్థులు ఆందోళన కూడా చేశారు. శిథిల భవనాన్ని కూల్చివేసి కొత్తగా నిర్మించాలన్న ప్రతిపాదన ప్రభుత్వం ముందు ఉన్నప్పటికీ, ఆ దిశగా నేటికీ చర్యలు తీసుకోలేదు.



శ్లాబు పెచ్చులూడి ప్రమాదభరితంగా ఉన్న హాస్టల్ పైకప్పు

నామమాత్రపు అద్దెకు లభ్యం కాని ప్రయివేటు భవనం..

ఎస్ఎఫ్‌టి రూ.12కు లభించేలా అద్దె భవనంలోకి వసతి గృహ విద్యార్థులను తరలించాలని సాంఘిక సంక్షేమ శాఖ నుంచి ఆదేశాలు ఉన్నప్పటికీ, అంత తక్కువ అద్దెకు భవనం అందుబాటులో లభ్యం కాని పరిస్థితి ఉంది. అద్దె భవనం లభించక పోవడం, వెంటనే అద్దె భవనంలోకి విద్యార్థులను తరలించాలన్న ఉన్నతాధికారుల ఒత్తిడి మధ్య కింది స్థాయి ఎఎస్‌డబ్ల్యుఒ, హెచ్‌డబ్ల్యుఒ సతమతమవుతున్నారు.

అరకొర సదుపాయాలు...

పది మంది విద్యార్థులకు ఒక మరుగుదొడ్డి, స్నానపు గది ఉండాలన్న నిబంధనలు ఇక్కడ అమలులో లేవు. 80 మంది విద్యార్థులకు ఆరు మరుగుదొడ్లు, ఆరు స్నానపు గదులు ఉన్నాయి. ఇవి కూడా మరమ్మతుకు గురయ్యాయి. వర్షం కురిస్తే తడవ కూడదన్న కారణంతో మరుగు దొడ్డి స్లాబ్‌పైన గోడపై రేకు తలుపు ఉంచారు. అంటే పరిస్థితి ఏ స్థితిలో ఉందనేది ఇట్టే స్పష్టమౌతోంది.

దూరప్రాంతాల నుంచి...

ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అరకు, పాడేరు, చింతపల్లి, గూడెం తదితర గిరిజన గ్రామాల నుంచి ఇక్కడకు వచ్చి ఇంటర్, పీజీ చదువుతున్నారు.

వార్డు సచివాలయంలో నిద్ర...

హాస్టల్‌కు కొద్ది దూరంలో ఉన్న వార్డు సచివాలయం భవనం రెండో అంతస్తులో 80 మంది హాస్టల్ విద్యార్థులు రాత్రి పూట నిద్రిస్తున్నారు. తాగేందుకు, ఇతర అవసరాలకు హాస్టల్‌లో బోరు నీరు, కుళాయి నీరు పూర్తి స్థాయిలో సరిపోతుంది.

ఇబ్బందిగా ఉంది..

హాస్టల్ భవనం స్లాబ్, గోడలు, అన్నీ పెచ్చులూడి ఉన్నాయి. ఏ క్షణంలో పెచ్చులు తమ మీద పడతాయో తెలియని భయాందోళనలో ఉన్నాం. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం హాస్టల్‌లోనే చేస్తున్నాం. రాత్రి నిద్రకు వార్డు సచివాలయంలో పడుకుంటున్నాం. కాలేజీ నుంచి వచ్చాక సచివాలయంలోనే చదువుకుంటున్నాం.

– సునీత్, బివిఎస్‌సి, ఫైనల్ ఇయర్ విద్యార్థి, అరకు

వేరే అద్దె భవనంలోకి తరలించాలి

పరిస్థితి చేయి దాటక ముందే ప్రత్యామ్నాయంగా వేరే అద్దె భవనంలోకి తమను తరలించాలి. చాలీచాలని వసతులు, మరుగు దొడ్లు, స్నానపు గదులు ఉన్నాయి. అనేక అవస్థలు పడుతున్నాం.

-కె సాయిబాబు, బిఎస్‌సి ద్వితీయ ఏడాది, కడుగుల, గూడెం మండలం

సొంత భవనం సమకూర్చాలి

ఇక్కడ శాశ్వత భవనం నిర్మించాలి. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం చేసే సమయంలో పెచ్చులు మీద పడతాయేమోనని పైకి చూస్తూ భయపడుతూ తింటున్నాం.

-ఎస్.వికాస్‌రాజ్, బిఎ, ఫైనల్ ఇయర్

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో ప్రభుత్వాల నిర్లక్ష్యం

ప్రజాశక్తి -గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపుతున్నాయని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య నేతలు గణేష్ పండా, జె కిషోర్ బాబు, ఆడారి అప్పారావు అన్నారు. గురువారం గాజువాక ఎస్‌బిటిఎల్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, సమాఖ్య రాష్ట్రస్థాయి కార్మిక సదస్సు ఈనెల 9న శనివారం గాజువాక, శ్రామికనగర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లోని సంక్షోభం–కార్మిక వర్గ కర్తవ్యాలు, అనే అంశంపై చర్చ ఉంటుందన్నారు.

ప్రజాదర్బార్‌కు స్పందన

ప్రజాశక్తి–ములగాడ: అభివృద్ధి, ప్రజా సంక్షేమమే టిడిపి కూటమి ప్రభుత్వ లక్ష్యమని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గురువారం 61,62 వార్డుల పరిధిలోని మల్కాపురం ప్రకాష్‌నగర్‌లో ప్రజాదర్బార్ నిర్వహించి, వినతులు స్వీకరించారు. సామాజిక పింఛన్లు, ఇళ్ల స్థలాలు, కొత్త రేషన్ కార్డులు మంజూరు వంటి వ్యక్తిగత అవసరాలకు సంబంధించి ఎక్కువగా అర్జీలు రాగా, కొన్నింటిని అక్కడికక్కడే అధికారుల సమక్షంలో పరిష్కరించారు. జెడ్‌సి బి.రాము పాల్గొన్నారు.

కేన్సర్ పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి– సీతమ్మధార :కేన్సర్ పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ పి..జగదీశ్వరరావు సూచించారు. గురువారం కేన్సర్ దినోత్సవం సందర్భంగా డిఎంహెచ్‌ఒ కార్యాలయం నుంచి సత్యం కూడలి వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.

సురక్షిత పట్టణాల నిర్మాణంలో ప్రణాళికా విభాగం కీలకం

మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు

కె.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి–సీతమ్మధార : సుస్థిర జీవనానికి, అనుకూల సురక్షిత పట్టణాల నిర్మాణంలో పట్టణ ప్రణాళిక విభాగం కీలకపాత్రను కలిగి ఉందని ఎపి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఏటా నవంబర్ 8న నిర్వహించే ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ, పట్టణ ప్రణాళిక విధానాలు ప్రజల జీవితాలను మెరుగుపరచడంలో, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడంలోనూ, పర్యావరణ పరిరక్షణలో చేసే కృషిని గుర్తిసుందన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ప్రణాళికకర్తలు పట్టణ విస్తీర్ణం నియంత్రించడం, హరిత ప్రదేశాలను అభివృద్ధి చేయడం భూమి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా సుస్థిర అభివద్ధి లక్ష్యాలను సాధిస్తారన్నారు అభివృద్ధి కొనసాగుతున్న నేపథ్యంలో జనాభా పెరుగుదల, వనరుల కొరత వాతావరణం మార్పులు వంటి సవాళ్లకు పట్టణ ప్రణాళిక సమర్థవంతంగా స్పందిస్తుందన్నారు అత్యవసర మౌలిక సదుపాయాలు రవాణా సౌకర్యాలు సురక్షిత హౌసింగ్ వంటి అంశాల్లో సానుకూల మార్పులు తెచ్చేందుకు పట్టణ ప్రణాళిక ముందుకు వస్తుందన్నారు పర్యావరణ పరిరక్షణ చర్యలు వ్యర్థాలు నిర్వహణ, కాలుష్య నియంత్రణ వంటి చర్యలు పట్టణ ప్రణాళికలో భాగంగా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఉద్యోగులు పట్టణాల్లో అభివృద్ధిలో తమ వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో పట్టణ ప్రణాళిక మరింత ప్రాధాన్యత సంతరించుకుందన్నారు స్మార్ట్ సిటీస్, పారిశ్రామిక ప్రగతి, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలలో సమగ్ర ప్రణాళిక అవసరమన్నారు సమగ్ర ప్రణాళిక బద్ధమైన చర్యలతో తమ కృషిని కొనసాగించాలని మున్సిపల్ ఉద్యోగులను కోరారు.

పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చి హక్కులు కల్పించండి

ప్రజాశక్తి–ఆనందపురం :గంభీరం పంచాయతీ సర్వే నెంబరు 104లోని 13.80 ఎకరాల గ్రామకంఠం స్థలం తమ ఆధీనంలో ఉందని గ్రామస్తులు తెలిపారు. కొన్నేళ్లుగా తమ అధీనంలో ఉన్న స్థలాన్ని ఎపిఐఐసికి ఇవ్వాలని ప్రయత్నించినా అడ్డుకున్నామన్నారు. ఆ స్థలంలో దళిత, యాదవ, శెట్టి బలిజ, పద్మశాలి తదితర సామాజిక వర్గాలకు చెందిన 200 కుటుంబాలు ఉన్నాయన్నారు. రెవెన్యూ అధికారులు పరిశీలన జరిపి పొజిషన్ సర్టిఫికేట్‌లతో హక్కులు కల్పించాలని కోరారు

మద్యం దుకాణాల కేటాయింపులో గీత కార్మికులకు న్యాయం చేయాలి

మాట్లాడుతున్న నూకరాజు

ప్రజాశక్తి– సీతమ్మధార : ప్రభుత్వం ప్రకటించిన విధంగా పదిశాతం రిటైల్ మద్యం దుకాణాలను కల్లుగీత వత్తిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అర్హులకు అందేలా చర్యలు చేపట్టాలని ఉత్తరాంధ్ర యాత సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షులు పిల్లి నూకరాజు కోరారు. శుక్రవారం నరసింహనగర్‌లోని తన స్వగృహంలో సంఘం ప్రతినిధులతో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ, గీత వృత్తి సొసైటీల ద్వారా కల్లు వ్యాపారం చేస్తున్న వ్యక్తులకు ఇబ్బందులు లేకుండా మద్యం దుకాణాలను కేటాయించాలన్నారు. గీత వృత్తిదారుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని మద్యం దుకాణం కేటాయించని వారికి దరఖాస్తు ఫీజు వాపసు చేసేలా నిబంధన సడలించాలని కోరారు.జనాభా దామాషా ప్రకారం గ్రామీణ మండలాల్లో ఒక మద్యం దుకాణాన్ని గీత కార్మికులకు కేటాయించాలని కోరారు. సమావేశంలో ఈశ్వరరావు, సంపంగి మంగరాజు, గోవిందరావు, పిల్లి నూకరాజు, దేవుడు చలం శ్రీనివాసరావు, వరహాలు, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

24న భీమ్‌సేన్ వార్ ఆధ్వర్యంలో సదస్సు

ప్రజాశక్తి–సీతమ్మధార : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భీమ్‌సేన్ వార్ ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం – ప్రజాస్వామ్యం– ఎన్నికలు ప్రజాసంక్షేమం' అంశంపై ఈ నెల 24న అంబేద్కర్ భవన్‌లో మహా సదస్సు నిర్వహిస్తున్నట్టు భీమ్‌సేన్ వార్ అధ్యక్షులు కె.చిన్నారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. గురువారం పౌర గ్రంథాలయంలో ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ రమణమూర్తి, తదితరులతో కలిసి సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. సదస్సుకు పౌర హక్కుల సంఘం నేత ప్రొఫెసర్ జి హరిగోపాల్, పూలే అంబేద్కర్ సెంటర్ ఇంగ్లీష్ ట్రైనింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలబోయిన సుదర్శన్ ముఖ్య వక్తలుగా పాల్గొంటారని, పాటలతూట విజయభాస్కర్, ప్రజా వాగ్గేయకారుడు చుక్క రామనర్సయ్య పాల్గొంటారన్నారు.

పేదలకు ఇళ్లు కేటాయించాలి

ప్రజాశక్తి– ములగాడ : అర్హులైన నిరుపేదలకు ఇళ్లస్థలాలతోపాటు ప్రభుత్వపరంగా ఇంటి నిర్మాణాలకు ఆర్తికసాయం మంజూరు చేయాలని సిపిఐ పశ్చిమ నియోజకవర్గ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ డిమాండ్ చేశారు. గురువారం మల్కాపురంలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అర్హులకు టిడ్కో ఇళ్లుఇవ్వాలని, పట్టణప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు ఇంటి స్థలాలను కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షల ఆర్థికసాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నేతలు గుడాల రాంబాబు, కె.కామేశ్వరరావు, కె కనకరాజు, సురేష్, వెంకట్ అప్పారావు ఉన్నారు.

విజయసాయిరెడ్డికి అభినందన

ప్రజాశక్తి– వేపగుంట :వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వి.విజయసాయి రెడ్డిని నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం నగరంలో పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి గుడివాడ అమర్నాధ్, పలువురు పార్టీ నాయకులతో కలసి విజయసాయిరెడ్డిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను సాయిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని, బాధిత వైసిపి శ్రేణులను నేరుగా కలిసి భరోసా కల్పించాలని కోరినట్లు శ్రీధర్ తెలిపారు.

బ్యాడ్మింటన్ అకాడమీకి స్థల కేటాయింపుపై నిరసన

ప్రజాశక్తి – ఆరిలోవ :పెదగదిలిలో బాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధుకు కేటాయించిన స్థలాన్ని అకాడమీకి కాకుండా స్థానిక విద్యార్థుల కోసం జూనియర్ కళాశాల కేటాయించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు డిమాండ్ చేసారు. గురువారం తోటగరువు వెర్నిమాంబ గుడి వద్ద నిరసన చేపట్టారు. అందరికి అందుబాటులో ఉండే స్థలాన్ని ప్రజాప్రయోజనకర జూనియర్ కాలేజీకి కాకుండా, బ్యాడ్మింటన్ అకాడమీకి కేటాయించడం సరికాదన్నారు వేరే చోట అకాడమీకి స్థలాన్ని ఇవ్వాలని కోరారు.

సమస్యలపై సిపిఎం ధర్నా

ఇంద్రానగర్‌లో ధర్నా చేస్తున్న సిపిఎం శ్రేణులు

ప్రజాశక్తి-గోపాలపట్నం : ధరాభారం, ఛార్జీల మోతతోపాటు ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంపై గురువారం జివిఎంసి 91వార్డు ఇంద్రనగర్‌లో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పార్టీ గోపాలపట్నం జోన్ కమిటీ సభ్యుడు బలివాడ వెంకటరావు మాట్లాడుతూ, నిత్యావసరాలు, పెట్రో ఉత్పత్తుల ధరలు తగ్గించాలని, ఉచిత ఇసుకను పూర్తిస్థాయిలో అందించాలని, సర్దుబాటు పేరిట పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు ఆర్ శేషగిరిరావు, ఆర్ నగేష్, ఆర్.నాయుడు పాల్గొన్నారు

బాసర డిగ్రీ కళాశాలలో ఎయు దూరవిద్యా కేంద్రం

అనుమతి పత్రాలను అందుకుంటున్న రమేష్

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక శ్రీ బాసర డిగ్రీ కళాశాలకు ఆంధ్రా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం మంజూరైందనివిద్యా సంస్థల ఛైర్మన్ పూడి రమేష్ తెలిపారు. ఈ మేరకు ఎయు దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ విజయమోహన్ అనుమతి పత్రం అందజేశారన్నారు. ఎయు దూరవిద్యా విధానంలో బిఎ, బికాం, బిఎస్‌సి, ఎంఎ, ఎంకాం, ఎంఎస్‌సి, ఎంబిఎ తదితర కోర్సుల నిర్వహణకు అనుమతి లభించిందన్నారు.

ఘనంగా హేమలత జన్మదిన వేడుక

కార్పొరేటర్ హేమలతను అభినందిస్తున్న జెడ్‌సి, తదితరులు

ప్రజాశక్తి- మధురవాడ: జివిఎంసి ఐదోవార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత పుట్టిన రోజు వేడుకలను బొట్టవానిపాలెం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. జోన్ 2 కమిషనర్ పి సింహాచలం, ఎపిడి శ్రీరామ్, టిడిపి నాయకులు వాండ్రాసి అప్పలరాజు,మొల్లి లక్ష్మణరావు, బోయి శ్రీనివాస్, రమాదేవి, నమ్మి శ్రీను, నాగోతి సత్యనారాయణ, ఈగల రవి తదితరులు హేమలతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడల్లో ప్రతిభకు అభినందన

ప్రజాశక్తి- సీతమ్మధార : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ చూపి పతకాలను సాధించిన బుల్లయ్య కాలేజీ విద్యార్థులను కళాశాల సెక్రెటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ జి. మధు కుమార్ విద్యార్థులను అభినందించారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీలో నిర్వహించిన 68వ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఇంటర్ ఎంపిసి ఫస్టియర్ విద్యార్థిని బి.శైలజ, 100 మీటర్ల పరుగులో రజతం, 200 మీటర్ల పరుగులో బంగారు పతకం, 4X100 మీటర్ల రిలేలో రజత పతకాలను సాధించింది. అలాగే తెనాలి హైస్కూల్లో నిర్వహించిన అండర్ 17 వెయిట్ లిఫ్టింగ్ 81 కేజీల విభాగంలో ఇంటర్ ఫస్టియర్ ఎంపిసి విద్యార్థి ఎన్.శ్యామ్ కుమార్ రజత పతకాన్ని సాధించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.సోమేశ్వరరెడ్డి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, పీడీ డాక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి విద్యార్థులను అభినందించారు.

గంగకు న్యాయం చేయాలి : ఐద్వా

ఆందోళన చేస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి -కరాస: ఇంటి యజమాని అభియోగాలతో పోలీసుల దాడిలో కాలు విరగ్గొట్టుకున్న పని మనిషి గంగకు న్యాయం చేయాలని ఐద్వా నేతలు డిమాండ్ చేశారు. గురువారం గోపాలపట్నం జోన్ విమాననగర్ రజక కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో ఇంటి పని వారు గంగకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు. ఈసందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి వై సత్యవతి, జోన్ అధ్యక్షులు వి ప్రభావతి మాట్లాడుతూ, సీతమ్మధార ఆక్సిజన్ టవర్ అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న గంగపై ఇంట యజమాని ఎంవిపి పోలీసులకు ఫిర్యాదు చేయగా, గంగ కాలు విరిగిపోయేలా ఎస్ఐ, కానిస్టేబుళ్లు కొట్టారని, దీనిపై ప్రజాసంఘాల ఆందోళనతో పోలీసులను సిపి సస్పెండ్ చేశారన్నారు. ఈ నేపథ్యంలో బాధిరాలికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు సూర్యకాంతం, ఇంటిపని మనుష్యులు పాల్గొన్నారు.

పోస్టు కార్డు ఉద్యమానికి ప్రజాసంఘాల సంఘీభావం

పోస్టు కార్డులను ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి-సీతమ్మధార : స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర ప్రజాసంఘ నేతృత్వంలో నిర్వహించనున్న ప్రధాని మోడీకి 10 లక్షల పోస్ట్‌కార్డుల ఉద్యమానికి ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. గురువారం ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో దీనిపై చర్చించి, పోస్టు కార్డులను, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ వి.రమణమూర్తి మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ పోస్టుకార్డు ఉద్యమం రికార్డుగా చరిత్రలో నిలుస్తుందన్నారు. ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు వాడవాడలా ప్రతిఇంటికి వెళ్లి, పోస్టుకార్డును పంపేలా అవగాహన కల్పించడంతోపాటు ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో భాగస్వాములయ్యేలా చైతన్యపరచాలని సూచించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక నిరసన ప్రధాని మోడీకి తెలియపరచడమే దీని లక్ష్యమన్నారు. ఉద్యమానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజా, కార్మిక, మహిళ, పౌర, దళిత, విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు ముందుకు రావడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ నెల 10న ఉదయం 6 గంటలకు ఆర్‌కె బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద పోస్ట్ కార్డుల ఉద్యమం ప్రారంభిస్తామన్నారు. పోస్ట్ కార్డులు కావలసినవారు 9490690458, 8790012918 నెంబర్లకు సంప్రదించాలన్నారు. సమావేశంలో ప్రజాసంఘాల నేతలు కె.వెంకటేశ్వర్లు, లలిత, వేమన, సోడదాసు సుధాకర్, వసంత రాజేంద్రప్రసాద్, సలీమ్,శ్రీరామ్మూర్తి, బూసి వెంకటరావు, వై నూకరాజు, సూర్య ప్రకాష్, రాం ప్రభు, వై కొండయ్య పాల్గొన్నారు.

విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు తగ్గించాలని ధర్నా

సిఎండికి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి-సీతమ్మధార : సర్దుబాటు పేరుతో వినియోగదారులపై మోపనున్న విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ ఒబిసి విభాగం రాష్ట్ర ప్రతినిధి మూల వెంకటరావు డిమాండ్ చేశారు. గురువారం సీతమ్మధారలోని ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించి, సిఎండి పృథ్వీతేజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలోయువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు, నేతలు సూర్యనారాయణ, శివకుమార్, చిన్నబాబు, సతీష్, మణికంఠ, ఆలీ, వరాలమ్మ, ఎర్రయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

గీతంలో విదేశీ విద్యార్థులకు అవగాహన

గీతం ప్రతినిధులతో డిసిపి అజిత

ప్రజాశక్తి -మధురవాడ : వివిధ దేశాల నుంచి వచ్చి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న అంతర్జాతీయ విద్యార్థులు భారతదేశ సంస్కృతి సంప్రదాయాలను అర్థం చేసుకుని, ఇక్కడ మంచిని గ్రహించి విద్యార్థులతో సత్సంబంధాలను పెంచుకుని ఉన్నత వ్యక్తిత్వంతో పట్టభద్రులుగా తమ దేశాలకు వెళ్ళాలని డిప్యూటీ పోలీస్ కమిషనర్ వి.అజిత సూచించారు. గురువారం గీతంలో నూతనంగా ప్రవేశం పొందిన విదేశీ విద్యార్థులకు అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ విదేశీ విద్యార్థులకు విశాఖ సురక్షితమైనదన్నారు..సిలబస్‌ను అర్థం చేసుకుని, అధ్యాపకులను అనుసరిస్తూ విద్యాభ్యాసంపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా చుట్టూ ఉన్న సమాజాన్ని అర్థం చేసుకుని వక్తిత్వవికాసంతో ఎదగాలన్నారు. వివిధ దేశాల విద్యార్థుల పరస్పర అవగాహన, ఒకరి సంస్కృతిని మరొకరు అర్థం చేసుకుని ఎదగాలని సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రొవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ అంకిత భావం, కష్టపడే గుణం ఉంటే ఉన్నత విద్యలో ఉత్తమ ఫలితాలను సాధించవచ్చునని సూచించారు. గీతంలో అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల మార్గదర్శకం విదేశీ విద్యార్థులు సకాలంలో కోర్సులు పూర్తి చేసి తిరిగి దేశాలకు వెళ్ళేలా వీలు కల్పిస్తున్నాయన్నారు. గీతం అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.పి.సి.కిషన్ మాట్లాడుతూ గీతంలో ప్రస్తుతం 40 దేశాలకు చెందిన 450 మందికి పైగా విదేశీ విద్యార్థులు వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారని, కొత్త విద్యా సంవత్సరంలో 29 దేశాల నుంచి విద్యార్థులు ప్రవేశం పొందారని వెల్లడించారు. విదేశీ విద్యార్థుల ద్వారా గీతం అంతర్జాతీయంగా గుర్తింపు పొందుతోందని తెలిపారు. భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అంతర్జాతీయ విద్యార్థులకు స్కాలర్ షిప్ రూపంలో ప్రోత్సహిస్తోందని తెలిపారు. గీతంలోని విదేశీ విద్యార్థుల సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ వివిధ సంగీత, నృత్య కార్యక్రమాలు ప్రదర్శించారు.

దుర్గారావు హత్యకేసులో నిందితులను అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి- పెందుర్తి : మండలంలోని కృష్ణరాయపురంలో బొప్పర దుర్గారావుపై దౌర్జన్యానికి పాల్పడి, హత్య చేసిన నిందితులను తక్షణం అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, సిపిఎం గోపాలపట్నం జోన్ కమిటీ కార్యదర్శి బి.జగన్ ప్రకటనలో డిమాండ్ చేశారు. అదే ప్రాంతానికి చెందిన పెద్ద నూకరాజు, వరలక్ష్మి అజయ్,గౌతమ్, చిన్న నూకరాజు, సంతోషి, కార్తీక్, లలిత మూకుమ్మడి దాడిలో తీవ్రంగా గాయపడి, కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం దుర్గారావు మృతి చెందాడన్నారు. ఈ ఘటనపై హోంశాఖ మంత్రి అనిత స్పందించి, బాధ్యులైన నిందితులపై తక్షణ చర్యలు చేపట్టి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని జగన్ డిమాండ్ చేశారు. లేకుంటే బాధిత కుటుంబీకులతో కలిసిఆందోళన చేయక తప్పదని హెచ్చరించారు.

పవన్‌తో సర్పంచుల సంఘం భేటీ

డిప్యూటీ సీఎంను అభినందిస్తున్న సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి -ఆనందపురం : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను అమరావతిలో రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు, గంభీరం సర్పంచ్ వానపల్లి లక్ష్మి ఆధ్వర్యంలో గురువారం సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా 16 అంశాలతో కూడిన సమస్యలను డిప్యూటీ సీఎం పవన్‌కు వివరించారు. ముఖ్యంగా రాజధానిలో సంఘం భవన నిర్మాణానికి రెండు ఎకరాల స్థలం కేటాయించాలని కోరగా, డిప్యూటీ సీఎం పవన్ సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో సాంబార్ అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్, ఉప ఆధ్యక్షులు వానపల్లి ముత్యాలరావు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, తాటితూరు జెడ్‌పి హైస్కూల్లో గురూవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. స్కౌట్ ఉద్యమ నిర్మాత రాబర్ట్ స్టీఫెన్సన్ పవెల్ చిత్రపటానికి హెచ్‌ఎం, ఇన్చార్జి హెచ్‌ఎం, జిల్లా స్కౌట్స్ హెడ్‌క్వార్టర్ కమిషనర్ టిఎస్‌వి ప్రసాదరావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ, విద్యార్థులకు దేశభక్తి, క్రమశిక్షణ, సమాజ సేవ, ఆరు బయట నివాసం, జాతీయ సమైక్యత, చేతి కళలు, సాహస కృత్యాలు, ప్రథమ చికిత్స, ప్రకృతి పరిశీలనపై శిక్షణనిచ్చి వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడమే స్కౌట్స్ లక్ష్యమన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-ఆనందపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎలర్ కె నాయుడు, వైస్ ప్రెసిడెంట్‌గా కె. భాగ్యలక్ష్మి, జనరల్ సెక్రటరీగా ఎ. ధనుంజయ, జాయింట్ సెక్రటరీలుగా షేక్ మౌలాలి, వి ప్రసాద్, ట్రెజరర్‌గా శ్రీరామ మూర్తి, కార్యవర్గ సభ్యులుగా పి.దుర్గాదేవి, కె.చలపతి రావు, జి.విజయలక్ష్మి, వై.సునీత,ఎస్.అనురాధ, ఒ.సౌజన్యలను ఎన్నుకున్నారు.

పాఠశాలకు మరమ్మతులు చేయండి

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఆరోవార్డు కె2 పాఠశాల భవనానికి మరమ్మతులు చేయాలని స్థానిక టిడిపి నేతలు కోరారు. ఈమేరకు జెడ్‌సి సింహాచలంను కలిసి వినతిపత్రంఅందజేశారు. పాఠశాల భవనం పైకప్పు పెంకులు, ఫ్లోరింగ్, గోడలు పెచ్చులూడడంతోపాటు తలుపులు, కిటికీలు పాడవ్వడంతో చిన్నపాటి వర్షం కురిసిన కారిపోయే పరిస్థితి ఉందన్నారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతోపాటు జెడ్‌సికి వినతిపత్రాలను అందజేశారు. టిడిపి వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీను, పిళ్లా వెంకటరావు, కాలనీ ప్రెసిడెంట్ అప్పికొండ ఉమా మహేష్ కింజరాపు భరత్‌కుమార్, నడిపురి లూథియా, సింగంపల్లి భవాని, ఆకుల గౌరీ పాల్గొన్నారు.

రమేష్ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తాం

7వ వర్ధంతి సభల్లో సిఐటియు నేతలు

అనకాపల్లిలో రమేష్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న శంకరరావు తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

సిఐటియు విశాఖ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎస్.రమేష్ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామని ఆ సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు తెలిపారు. అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో గురువారం కామ్రేడ్ రమేష్ 7వ వర్ధంతి సభ జరిగింది. ముందుగా రమేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ కామ్రేడ్ రమేష్ చిన్న వయసులోనే బాలకళాకారుడిగా ఉద్యమ ప్రస్థానం ప్రారంభించి, విద్యార్థి, కార్మిక ఉద్యమ నేతగా జిల్లాలో అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. ఎస్ఈజెడ్ భూముల రైతులు, గంగవరం పోర్టు నిర్వాసితులు, గిరిజన ప్రాంతంలో కాఫీ కార్మికులు, చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికులు, స్కీమ్ వర్కర్లు ఇలా అనేక తరగుతుల వారి పోరాటాలకు రమేష్ నాయకత్వం వహించారని గుర్తు చేశారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న కాలంలో రమేష్ లేకపోవడం ఉద్యమానికి తీరని లోటన్నారు. ప్రజా, కార్మిక సమస్యలపై పోరాటమే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లా ఉద్యమంలో కామ్రేడ్ రమేష్ చెరగని ముద్ర వేశారన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పరమేశ్వరరావు, బొప్పే ఉమా మహేశ్వరరావు, అల్లు రాజు, గొర్లె, మేకల పెంపకదారుల సంఘం జిల్లా చైర్మన్ గంటా శ్రీరామ్, రైతు సంఘం నేతలు కర్రి అప్పారావు, గండి నాయనబాబు, ఆశా యూనియన్ నేత సూర్యకళ, ఐద్వా నేత జి.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి : సిఐటియు మండల కార్యాలయంలో కామ్రేడ్ ఎస్.రమేష్ చిత్ర పటానికి సిఐటియు మండల కార్యదర్శి చింతకాయల శివాజీ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విఆర్ఎ సంఘం నాయకులు ప్రసాదు అప్పారావు, రవణమ్మ, ప్రైవేట్ లెక్చరర్ దుర్గారావు, సిఐటియు నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

చోడవరం : ఎస్.రమేష్ ఏడవ వర్ధంతి సందర్భంగా చోడవరంలో సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు రమేష్ అండగా ఉండేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకులు కే వరలక్ష్మి, బి రామలక్ష్మి, మిడ్డేమీల్స్ కార్మికులు ఆర్ఆర్ బుచ్చిరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండల కేంద్రంలో కామ్రేడ్ ఎస్ రమేష్ ఏడవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిఐటియు నేతలు పూలమాల వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు, నాయకులు చందక రామకృష్ణ, వై రాము, డి కాశియా, సిహెచ్ పవన్ కుమార్, బి అప్పారావు, లక్ష్మణ్, సన్యాసిరావు, ఐద్వా నేత కె నూకరత్నం పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఎస్.రమేష్ ఏడవ వర్ధంతి సందర్భంగా స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఈ.నాయుడు బాబు, వెలుగు వివోఏలు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోటలో ఎస్.రమేష్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సిఐటియు. జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి.వరలక్ష్మి, అంగన్వాడీ, మిడ్డేమీల్స్ యూనియన్ నాయకులు టి.తనూజ, బి.సూర్యలక్ష్మి, టి.శ్యామల, జగదీశ్వరి, కుమారి, అమ్మాజీ, చిన్నారి, రమాదేవి, జయలక్ష్మి, కొండమ్మ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : స్థానిక సీఐటియు కార్యాలయంలో ఎస్. రమేష్ 7వ వర్ధంతి సభ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు అధ్యక్షతన జరిగింది. రమేష్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాస్‌రావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె త్రిమూర్తులు రెడ్డి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్ గౌరి, ఎల్ఐసి యూనియన్ నాయకులు పడాల్, ఐద్వా జిల్లా ట్రెజరర్ కెవి సూర్యప్రభ, సిఐటియు మండలం కార్యదర్శి కె.ప్రసన్న, అంగన్‌వాడి ప్రాజెక్టు అధ్యక్షులు రుత్తల రమణమ్మ, సామ్రాజ్యం, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలోని బొడ్డపాలెం సిఐటియు కార్యాలయం వద్ద ఎస్.రమేష్ ఏడవ వర్ధంతిని నిర్వహించారు.ముందుగా రమేష్ చిత్రపటానికి భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, స్థానిక నాయకులు యుఆర్ఎస్ నాయుడు,

నర్సీపట్నంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

బి.లక్ష్మణరావు పూలమాలవేసి నివాళులర్పించారు. జోన్ కమిటీ నాయకులు కె.నాగరాణి, ఎస్ అప్పలనాయుడు, కష్ణాచార్య ప్రజానాట్యమండలి సభ్యులు దల్లి రాంబాబు స్థానిక మహిళలు, విసిసి కమిటీ పిల్లలు పాల్గొన్నారు.

రమేష్ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు

విశాఖ కలెక్టరేట్ : కార్మిక హక్కుల రక్షణ కోసం రమేష్ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు చేపట్టాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. గురువారం జగదాంబ దరి సంఘం కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎస్.రమేష్ ఏడో వర్ధంతి సభ జరిగింది. ముందుగా రమేష్ చిత్రపటానికి సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, సిపిఎం జివిఎంసి ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ రమేష్ విద్యార్థి దశ నుంచే ఉద్యమాల్లో చురుగ్గా ఉన్నారన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. విశాఖ జిల్లాలో చిట్టివలస జ్యూట్ మిల్లు, ఏజెన్సీలో కాఫీ వర్కర్ల సమస్యలు, బ్రాండిక్స్ కార్మికులు, జీడిపిక్కల కార్మికులు, స్కీం వర్కర్ల సమస్యలపై ఆయన అలుపెరగని పోరాటాలు నిర్వహించారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పి.మణి, బి.జగన్, పి.వెంకటరెడ్డి, ఎస్.జ్యోతీశ్వరరావు, రామస్వామి, కెఎం.కుమారమంగళం, వై.రాజు, ఎం.సుబ్బారావు, సీత, అప్పలరాజు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, డివైఎఫ్ఐ నాయకులు యుఎస్ఎన్.రాజు, కె.సంతోష్ పాల్గొన్నారు.



విశాఖలో నివాళులర్పిస్తున్న కుమార్, కెఎం.శ్రీనివాస్, గంగారావు

అర్జీలపై పూర్తి విచారణ చేసి పరిష్కరించాలి

కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

రెవెన్యూ గ్రామ సభలలో రీ సర్వే అభ్యంతరాలపై వచ్చిన అర్జీలపై పూర్తి విచారణ చేసి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ, ఎక్సైజ్, మైన్స్ శాఖలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. రీ సర్వే అభ్యంతరాలపై రోజువారి నివేదికలు సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామసభలలో ప్రత్యేక సమస్యలు ఏమైనా ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. 22ఏ భూములకు సంబంధించి అనుమానాలు ఉంటే ఉన్నతాధికారుల వద్ద వివరణ తీసుకోవాలన్నారు. జిల్లాలో మాజీ సైనికులకు ఇచ్చిన భూమి వివరాలు, పట్టా కొరకు దరఖాస్తు చేసిన వివరాలు వెంటనే తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. గనుల శాఖ అధికారులతో సమీక్షలో గనుల తవ్వకాల అనుమతులు మంజూరుకు పెండింగు దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గనుల అక్రమ తవ్వకాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖకు సంబంధించి సమీక్షలో బెల్ట్ షాపులను అరికట్టాలని, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, ఎస్‌డిసిలు, ఆర్డీఓలు షేక్ ఆయిషా, వివి రమణ, తహసీల్దార్లు, డీటీలు సర్వేయర్లు, మైనింగు, ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

దీపం-2 పథకానికి ఇంటి వద్దే ఉచితంగా ఇకెవైసి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్న దీపం పథకం -2కి లబ్ధిదారుల ఇంటి వద్దే ఉచితంగా ఈకేవైసీ చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి స్పష్టం చేశారు. జెసి ఛాంబర్లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలో మొత్తం దీపం, ఉజ్వల1 ఉజ్వల2, పిఎస్ఆర్, జనరల్ కేటగిరీలకు చెందిన 5,17,081 గ్యాస్ కనెక్షన్‌దారులు ఉన్నారని, వారిలో 3.60 లక్షల మంది దీపం-2కి అర్హులుగా గుర్తించడం జరిగిందని చెప్పారు. ఈ పథకం కింద అపోహలు, సూచనలు, ఇబ్బందులు ఉంటే తమకు సంబంధించిన వార్డు, గ్రామ సచివాలయాల్లో, లేదా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, లేదా పౌర సరఫరాల శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1967లో తెలియజేసుకోవచ్చని పేర్కొన్నారు.

నేడు సిపిఎం మండల మహాసభ

ప్రజాశక్తి-అనకాపల్లి : సిపిఎం అనకాపల్లి మండల మహాసభ దొడ్డి రామునాయుడు భవనంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఆ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు పరిశీలకులుగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. పార్టీ సభ్యులంతా హాజరై ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

హోంగార్డుకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎలమంచిలి పట్టణ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన జీ.అప్పారావుకు ఆర్థిక సాయంగా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు ఒక రోజు డ్యూటీ అలవెన్స్ 3 లక్షల 82 వేల 690 రూపాయల చెక్‌ను తన కార్యాలయంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అందజేశారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి ఎ.రామ్ కుమార్ పాల్గొన్నారు.

అరెస్టులకు భయపడేది లేదు

ప్రజాశక్తి-అనకాపల్లి : కూటమి ప్రభుత్వం రాక్షస పాలనలో ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని, దీనికి వైసిపి శ్రేణులు ఎంత మాత్రం భయపడేది లేదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. హోం శాఖ మంత్రిని చేతగాకపోతే ఊరుకో నేను ఆ పదవి తీసుకుంటా అని ఉప ముఖ్యమంత్రి అంటే రాష్ట్రంలో మానభంగాలు, హత్యలు, దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించడానికి అన్నారేమో అనుకున్నామని, తీరా చూస్తే కూటమి ప్రభుత్వంపై సోషల్ మీడియాలో వస్తున్న నిజాలను తట్టుకోలేక ఈ ప్రభుత్వంలో ఏమి చేయలేక ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. పోరాట యోధుడు జగనన్న సైన్యమని, కూటమి ఉడత ఊపులకు బయపడే నాయకత్వం గాని, పార్టీ కార్యకర్తలు గాని లేరని జాజుల రమేష్ హెచ్చరించారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ 80వ వార్డు పరిధి చినరామస్వామి కోవెల వద్ద ఉన్న మినీ వాటర్ ట్యాంక్ పైపులు లైనుకు మరమ్మతు కార్యక్రమం గురువారం చేపట్టారు. ఇక్కడ పైపులైన్ పాడైపోవడంతో మునిసిపల్ మంచినీటి కొళాయిలు రాక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి అధ్యక్షులు బొడ్డేడ మురళి, జనసేన నాయకులు సూరిశెట్టి రాముడు దృష్టికి అక్కడ ప్రజలు తీసుకువెళ్లారు. దీంతో వారు సంబంధిత అధికారితో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కారం చేయించారు. కార్యక్రమంలో కాంగ్రేగుల బుజ్జి, మద్దాల మోహన్, మద్దాల శంకర్, బొడ్డేడ రాజు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వాకపల్లి గ్రామంలో రోడ్డు భద్రత వారోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. వెలుగు ఏపిఎం ఎస్.ప్రభాకర్ ఆధ్వర్యంలో వాకపల్లి ఎస్‌హెచ్‌జి మహిళలు మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుగత రాజేశ్వరి, ఎంపిటీసీ గోరపల్లి భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి, సీసీ గౌరీశ్వర్, విఓఎలు వరలక్ష్మి, సోనియా, సచియాలయం సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్లో డిఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : అనకాపల్లి జిల్లా విద్యాశాఖధికారిగా బాధ్యతలు స్వీకరించిన గిడ్డి అప్పారావునాయుడు గురువారం మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం పథకం ఆహారం రుచి చూశారు. గుడ్లు తొక్కవలచి విద్యార్థులకు అందజేయాలన్నారు. మరుగుదొడ్లను పరిశీలించి కనీసం రోజుకు నాలుగు సార్లు శుభ్రం చేయాలన్నారు. గంధాలాయాన్ని సందర్శించారు. పిల్లలచే రూపొందించిన బోధనోపకరణాలు పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ టీచింగ్ నోట్స్ తయారు చేసుకోవాలని సూచించారు. 10వ తరగతుల విద్యార్థులు శాతశాతం ఉత్తీర్ణులయ్యేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి హెడ్ మాస్టర్ డివిజె అప్పారావు, వెంకట్ ప్రమీల, పద్మావతి, సిఆర్‌పి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థితో మాట్లాడుతున్న డిఇఒ అప్పారావునాయుడు

రైతు బజార్లు ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి-కె.కోటపాడు : అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి తదితర పట్టణాల్లో కొత్తగా రైతు బజార్లు ఏర్పాటుకు కృషి చేస్తానని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని మర్రివలస గ్రామంలో కూరగాయలు పండించే రైతులకు రైతు బజారు గుర్తింపు కార్డులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని కె.కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ మండలాల నుండి అధిక సంఖ్యలో రైతుల కూరగాయలు పండిస్తున్నారని, వారికి సరైన మార్కెటింగ్ సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూరగాయలు రవాణా చేయలేక దళారులు చేతిలో మోసపోతున్నారని, ఇవన్నీ దష్టిలో ఉంచుకొని కూరగాయలు నిల్వ చేసుకునేందుకు ప్రతి మండలానికి కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. మార్కెటింగ్ శాఖ ఏడి షేక్ యాసిన్ మాట్లాడుతూ రైతు బజార్ కార్డులు కొరకు 637 దరఖాస్తులు వచ్చాయని, 238 మందికి లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని, ఇందులో మాడుగుల నియోజకవర్గానికి 135 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, కూటమి నాయకులు రొంగలి మహేష్, జూరెడ్డి రాము, చల్లా సత్యనారాయణమూర్తి, కోటాన ఈశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బుధవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబీకులు అందించిన సమాచారం ప్రకారం.. మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన తాళపరెడ్డి గోవింద (39) విశాఖపట్నం కంచరపాలెంలో నివాసముంటూ కూలి పనులు చేసుకుంటూ భార్య ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నారు. నాగుల చవితి సందర్భంగా ఈ నెల 5న మంగళవారం తన తల్లి నివాసముంటున్న పోలేపల్లి గ్రామానికి వచ్చాడు. అదే రోజు రాత్రి 7 గంటల సమయంలో తన సోదరి ఉంటున్న మండలంలోని ఎల్బీపురం గ్రామానికి స్కూటీపై వెళ్తుండగా పి.భీమవరం జంక్షన్ సమీపంలో ఎదురుగా వస్తున్నా బైక్ గోవిందా స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోవిందను కుటుంబీకులు చోడవరం ఆసుపత్రికి, అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం తరలించారు. కేజీహెచ్ లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించినట్లు కుటుంబీకులు తెలిపారు. బుచ్చయ్యపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు పశుదాణా పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని అచర్ల గ్రామంలో తిరుమల డెయిరీ ఆధ్వర్యంలో గురువారం ఆ సంస్థ మేనేజర్ నైనముశెట్టి రమణరావు చేతులు మీదగా పాడి రైతులకు పశు దాణా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎన్.భూషణం, గ్రామస్తులు నిమ్మదల బాపునాయడు, బొడ్డేడ గణేష్, జాన్, పాడి రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలపై కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : పెరిగిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ అనకాపల్లి నెహ్రూ చౌక్ వద్ద గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. టిడిపి కూటమి సర్కార్ పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ కూటమి పార్టీలు ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు ఒక్క రూపాయి కూడా పెంచబోమని, 30 శాతం విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన ఐదు నెలల లోనే సర్దుబాటు ఛార్జిల పేరిట రూ.18 వేల కోట్లు విద్యుత్ వినియోగదారులపై భారం మోపి రాష్ట్ర ప్రజలను మోసగించిందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం ఇన్‌ఛార్జులు మల్లపురెడ్డి కోటేశ్వర్రావు, అనంతరావు, కచ్చాల చినబాబు, నాయకులు తుట్టా రమణ, కాళ్ళ సత్యనారాయణ, బోయిన భానుమూర్తి యాదవ్, విన్నకోట రాము, సేనాపతి రాజు, కె.శ్రీధర్, కిషోర్, బాల సూరా శ్రీనివాస్, ఏసురాజు, ఆదిమూర్తి, బుదబండి రాజు, ఉమ్మడి గోవింద్, రామ సత్యం, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

నిరసనలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు మీసాల సుబ్బన్న

ఆవు పాల సేకరణ ధరను పెంచాలని

29న విశాఖ డెయిరీ ముట్టడి

ఎపి పాల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, అజయ్‌కుమార్

ప్రజాశక్తి -అనకాపల్లి

విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాల ధరను తక్షణమే పెంచాలని కోరుతూ ఈ నెల 29న డెయిరీ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ పాల రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఉద్ధంరాజు రాంబాబు, కంచుమంటి అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో గురువారం పాల రైతు సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెయిరీ ఏక పక్ష నిరంకుశ వైఖరికి నిరసనగా డెయిరీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. విశాఖ డెయిరీకి రోజూ మూడున్నర లక్షల మంది రైతులు తొమ్మిది లక్షల లీటర్ల పాలు పోస్తున్నారని, అటువంటి రైతులకు పాల సేకరణ ధర పెంచి ఆదుకోవలసిన డెయిరీ యాజమాన్యం ఏకపక్షంగా పాల సేకరణ ధర తగ్గించడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఎనిమిదిన్నర లక్షల కోట్ల రూపాయల విలువచేసే సహకార రంగ ఆస్తుల పరిరక్షణకు రైతులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాల వల్ల పాడిపంట పరిశ్రమ దెబ్బతిని రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. కంపెనీ చట్టంలోకి మార్చిన తర్వాత విశాఖ డెయిరీ యాజమాన్యం ఇష్టానుసారం వ్యవహరించడం వల్ల డెయిరీ నష్టాల బారిన పడిందన్నారు. లాభాల బాటలో నడిచింది కాబట్టే విశాఖ డెయిరీ యాజమాన్యం అనేక అభివద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. నష్టాల్లో నడిస్తే ఇంకా ఎందుకు డెయిరీని కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. నష్టాలను చూపించడం ద్వారా డెయిరీ ఆస్తులను కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గ్రామస్థాయిలో డెయిరీ అవినీతిని ఎండ గట్టడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, కోశాధికారి గండి నాయన బాబు, పాల రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు గాడి భూలోక నాయుడు, కార్యదర్శి ఎస్‌వి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాల రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అజయ్‌కుమార్

విద్యార్థినులతో పనులు చేయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని ఎలమంచిలి మండలంలోని బాలికోన్నత పాఠశాల విద్యార్థినులతో తరగతి గదులు, ఆట స్థలం శుభ్రం చేయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారికి, డిఆర్‌ఒ బి.దయానిధికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ పాఠశాలకు స్లీపర్స్‌ను నియమించినప్పటికీ క్లాస్ టీచర్, హెచ్ఎంలు విద్యార్థులతో ఈ పనులు చేయించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేని ఎడల పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కే అర్జున్ పాల్గొన్నారు.

బొజ్జన్న కొండ అభివృద్ధికి మాజీ ఎంపీ సత్యవతి కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ బౌద్ధ ఆరామ క్షేత్రం బొజ్జన్న కొండ అభివృద్ధికి మాజీ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ సత్యవతి ఎనలేని కృషి చేసినట్టు సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ పల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం తెలిపారు. ఈ మేరకు గురువారం వివేకానంద ఆసుపత్రిలో బుద్దిస్ట్ సొసైటీ సభ్యులతో కలసి డాక్టర్ సత్యవతిని సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా బుద్దిస్ట్ సొసైటీ అధ్యక్షులు పల్లా బాబ్జీ, గౌరవాధ్యక్షులు నేలపూడి బాలరాజు, సిద్దార్థ సంస్థ ప్రతినిధులు వినకోట నీలేష్ గుప్తా, రొబ్బి మల్లేశ్వర రావు, కొత్తుర్తి రామారావు, బొడ్డు సోమరాజు, వూడా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రుణాల మంజూరులో ఇబ్బందులు సృష్టించొద్దు

ప్రజాశక్తి-కె.కోటపాడు : రుణాలు మంజూరులో బ్యాంకు మేనేజర్లు లబ్ధిదారులను ఎటువంటి ఇబ్బందులకు గురి చేయకుండా ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయాలని లీడ్ బ్యాంకు మేనేజర్ కే సత్యనారాయణ బ్యాంకు మేనేజర్లకు సూచించారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో జాయింట్ మండల లెవెల్ బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సకాలంలో చెల్లిస్తున్న సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు వారి అర్హతను బట్టి రుణాలు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో డిఆర్డిఏ ప్రాజెక్టు మేనేజర్ కే.కుమారస్వామి, మండల పరిషత్ పరిపాలనాధికారి అప్పలరాజు, ఎస్బిఐ ప్రతినిధి బి విజయ్ కుమార్ మాట్లాడారు.

రహదారి విస్తరణ పనులు పున:ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి : కాశీపురం నుండి గవరవరం వెళ్తే రహదారి విస్తరణ పనులు ఎట్టకేలకు పున:ప్రారంభమయ్యాయి. గత వైసిపి ప్రభుత్వంలో గవరవరం - కాశీపురం రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరు చేసింది. అప్పట్లో పనులు ప్రారంభమై, దాదాపు కల్వర్టులు పూర్తయ్యాయి. ఆ తర్వాత విస్తరణ పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. రహదారిని విస్తరించాల్సిన ఆవశ్యకత ఉందని ప్రజలు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం గవరవరం నుంచి రహదారి విస్తరణకు సంబంధించి మట్టి పనులు ప్రారంభించారు. ఈ పనులు పూర్తయితే మండలంలోని పలు గ్రామాలకు రహదారి సౌకర్యం కలుగుతుందని కూటమి శ్రేణులు వర్షం వ్యక్తం చేశారు.

డైట్‌లో ముగిసిన సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో మేజిక్ బస్సు పేరుతో నిర్వహించిన సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్ గురువారం ముగిసింది. వారం రోజులుగా ఎంబిఏ విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్ వర్కషాప్ నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు తెలిపారు. విద్యార్థులకు కావలసిన కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతిక నైపుణ్యత, అడాప్టివ్ స్కిల్స్, టైమ్ మేనేజ్మెంట్ వంటి అంశాలపై అవగాహన కల్పించామన్నారు. శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఫైబి రామ కుమార్, మేజిక్ బస్సు ట్రైనర్ కె.అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

చురుగ్గా జల్ జీవన్ మిషన్ పనులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : జల్ జీవన్ మిషన్ పథకం కింద మాడుగుల నియోజకవర్గంలో 68,036 కుటుంబాలకు ఇంటింటికి కుళాయిలు ఇచ్చే పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ జివిఎస్.ప్రకాష్ తెలిపారు. మండలంలోని వాలాబు, ఏ.కొత్తపల్లి, దేవరాపల్లి గ్రామాలలో గురువారం డీఈఈ పర్యటించి, జల్ జీవన్ మిషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పనుల కోసం రూ.171 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఈఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- సబ్బవరం : కార్మిక చట్టాన్ని ఉల్లాంఘిస్తే కఠిన చర్యలు తప్పవని చోడవరం లేబర్ ఆఫీసర్ పి.సత్యనారాయణ హెచ్చరించారు. పాన్ ఇండియా బాల కార్మిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కార్మిక శాఖ, ఐసిడిఎస్, సీడ్స్ ఆర్గనైజషన్, పోలీస్ డిపార్ట్మెంట్ కలిసి గురువారం సబ్బవరంలోని పలు దుకాణాలు, మెకానిక్ షాపులు, డాబా హోటళ్లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎవరైనా బాల కార్మికులను దుకాణాల్లో పనిచేయిస్తే 9948037377, 9492555018 ఫోన్ నెంబర్లకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ దివ్య, సీడీపీఓ కె.లలితకుమరి, సూపర్ వైజర్లు పైడితల్లి, వై.ఇందిర, కె.స్వర్ణ, సీడ్స్ తరుపున చిన్నరావు, జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి లోవరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి : తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రికి చెందిన అంధత్వ నివారణ విభాగం నేత్ర వైద్యులు బి మోహన్ రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు నేత్ర పరీక్షలు జరిపి సుమారు 18 మందికి దృష్టి లోపం ఉన్నట్టు నిర్ధారించారు. వారికి కళ్లద్దాలు సిఫారసు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్. శంకర్‌రావు, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ పెతకం శెట్టి బలరాం, పాల్గొన్నారు.

డివిఎన్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్ర యూనివర్సిటీ స్థాయిలో ఇంటర్ కొలిగేట్ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలలో దాడి వీరునాయుడు కళాశాలకు చెందిన విద్యార్థులు ఎస్ బాల సాయి చరణ్ 83 కేజీల పవర్ లిఫ్టింగ్ విభాగంలో బంగారు పతకం, 59 కేజీల పవర్ లిఫ్టింగ్ విభాగంలో జి నాగరాజు కాంస్య పతకాన్ని సాధించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్, యు.నాగేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోని శివాలయం నిర్మాణానికి సబ్బవరం గ్రామానికి చెందిన చెందిన రామకుమార్ ఆగ్రో ఏజెన్సీ షాప్ అధినేత గెడ్డం కుమార్ దంపతులు రూ.1,00,116 విరాళాన్ని గురువారం ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో బర్ల రమణ, గెడ్డం కృష్ణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్, గెడ్డం రమణ, చింతల శ్రీను, కొల్లి కృష్ణ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : చట్టాలపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం గ్రామ సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ అధ్యక్షతన సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జడ్పిటిసి కర్రి సత్యం, వ్యవసాయ శాఖ అధికారి ఎల్‌వై.కాంతమ్మ, ఏఈఓ కిరణ్ కుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రామానాయుడు, భాగ్యశ్రీ, రైతులు పాల్గొన్నారు,

కళాశాలలో మొక్కల నాటివేత

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో గురువారం భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అధ్యాపకులు పసిమల్లా, నిర్మల, ఉమామహేశ్వరి, ఎస్.శ్రీనివాస్, కాశీపురం జెడ్‌పి హైస్కూల్ ఉపాధ్యాయుడు కొటాన రాంబాబు, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.కొండలరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఏరియాలో సాంకేతిక పనుల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల కె.కోటపాడు, చౌడువాడ, గొండుపాలెం, గుల్లేపల్లి, ఏ.కోడూరు, మేడిచర్ల, రొంగలి నాయుడుపాలెం, దాలివలస, గొట్లాం, కె.సంతపాలెం, ఆర్లి, ఎ.భీమవరం, పైడంపేట గ్రామాల్లో ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

హాజరైన అభ్యర్థులు

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి- నర్సీపట్నంటౌన్:స్థానిక అల్లూరి సీతారామరాజు డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్ మేళాకు 15 కంపెనీ ప్రతినిధులు పాల్గొనగా 857 మంది నిరుద్యోగులు జాబ్ మేళాకి హాజరయ్యారని నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి గోవిందరావు అన్నారు. జాబ్ మేళాలో కాలేజ్ ప్రిన్సిపాల్ రాజు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న సర్పంచ్

మినీ తాగునీటి ట్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్.పురం మేజర్ పంచాయతీ పాతవీధి ఎస్సీ కాలనీలో ఎంతో కాలంగా ఉన్న తాగునీటి సమస్యను సర్పంచ్ లోచల సుజాత పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ వీధిలో ఎన్నో సార్లు పైపులైన్లు రిపేర్లు చేయించిన నీరు సరిగా అందకపోవటం జరిగేదన్నారు. లింగంపేట వాటర్ స్కీం ద్వారా వచ్చే మంచి నీళ్లు ఒక్కొక్కసారి మోటార్లు, మెయిన్ పైపులైన్లు రిపేర్లతో నీరు రాకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బంది పడేవారని చెప్పారు.2000 లీటర్ల మినీ ట్యాంకును ఏర్పాటు చేసి ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గజ్జలపు మణికుమారి, గ్రామ పెద్దలు బొడ్డు జమీలు, సిహెచ్.ప్రకాష్, వార్డు మెంబర్ సంజీవి పాల్గొన్నారు.

తొలగిస్తున్న ఆక్రమణలు

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఆర్ అండ్ బి ప్రధాన రహదారిని రోడ్డు మార్జిన్ కాలువను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన షెడ్డు, జ్యూస్, సెలూన్ బడ్డీలను గురువారం ఆర్ అండ్ బి, పంచాయతీ అధికారులు కోర్టు ఆదేశాల మేరకు జెసిబితో తొలగించారు. ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఎస్సై రమేష్ పర్యవేక్షించారు. వివాదం కారణంగా ఇరువర్గాలు కోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఆదేశాల మేరకు తొలగిస్తున్నట్లు రహదారులు భవనాలు శాఖ ఇంజనీర్ నారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి రఘురాం, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:అమరావతి నుండి రాష్ట్రవ్యాప్తంగా 5 సబ్ స్టేషన్లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం వర్చువల్ గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని బలిఘట్టం సబ్ స్టేషన్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మాట్లాడుతూ, 220 కేవీ సబ్ స్టేషన్ తీసుకురావడానికి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఎంతో కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ ఎనర్జీ పాలసీ విడుదల చేశారన్నారు. రానున్న రోజుల్లో నర్సీపట్నం నియోజకవర్గంలో యువతకు ఉపాధి కల్పన కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. త్వరలో టిడ్కో ఇళ్ల ఎన్టీఆర్ కాలనీగా మారి అన్ని విధాలా అభివృద్ధి చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, జెడ్పీటీసీ సుకల లమణమ్మ, ట్రాన్స్కో జోనల్ చీఫ్ ఇంజనీర్ శ్యామ్ ప్రసాద్, జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్యచంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు క్రిప్టోవర్ రాజశేఖర్, లక్ష్మన్నాయుడు, పలువురు డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న కలెక్టర్, నాయకులు

గ్రామీణ వైద్యుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - గాజువాక : గ్రామీణ వైద్యుల సంక్షేమానికి కృషి చేస్తానని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కూర్మన్నపాలెం ఫోర్ ఎస్ హాస్పిటల్ సౌజన్యంతో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులో మాట్లాడుతూ, గ్రామీణ వైద్యులు, ఆర్ఎంపిల సేవలు అమోఘమని, వారి గుర్తింపు కోసం సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానన్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి, గౌరవాధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు ఆసుపత్రి వైద్యులు పి. మురళీకృష్ణ, తాతాజీ, పిహెచ్ తపన్ కుమార్, పి.రవిశంకర్, గీతిక, సృజన, సుగుణేశ్వరి, అను, కె.మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లాను సత్కరిస్తున్న రైతులు

రెవెన్యూ గ్రామసభలు

ప్రజాశక్తి- రావికమతం: రీ సర్వేపై గ్రామాలలో నిర్వహించిన గ్రామసభలు ముగిశాయి. మరుపాకలో గ్రామ సభను అధికారులు నిర్వహించారు. 19 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులలో 2వేల కు పైగా రైతులు దరఖాస్తులు సమర్పించారు.

పద్మనాభం : రెవెన్యూ రికార్డులు, ఆన్లైన్లో భూవివరాలు తప్పులతడకగా ఉన్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కోరాడ గ్రామపంచాయతీలో నిర్వహించిన రీసర్వే గ్రామసభకు కోరాడ దూపేట గద్దపేట పడగలపేట గ్రామాల నుండి పెద్దఎత్తున రైతులు తరలివచ్చి తమ ఆందోళనను వ్యక్తం చేస్తూ దరఖాస్తులు అందజేశారు. భూవివరాలను సరిచేసి, తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఆనందపురం : మండలంలోని కోలవానిపాలెంలో గురువారం రీసర్వే రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో రీసర్వే డిటి గోవిందరావు మాజీ సర్పంచ్ కట్టుమూరి సోమునాయుడు, వైస్ సర్పంచ్ గన్రెడ్డి అప్పలరాజు, పప్పల శ్రీకాంత్ గుమ్మడి కాశి, గుంప శ్రీను పాల్గొన్నారు

క్రీడలతో ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:క్రీడలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ప్రోత్సాహకాలను కూడా ప్రభుత్వం పెంచిందని స్థానిక నింజా అకాడమీ కోచ్ అబ్బు గురువారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్ విజేతలకు ఇచ్చే ప్రోత్సాహకం రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచిందన్నారు. శాప్ లో గ్రేడ్ 3 కోచ్ల కోసం ఇంటర్నేషనల్ మెడల్స్ సాధించిన వారికి 50 శాతం రిజర్వేషన్ కల్పించనున్నారని తెలిపారు. ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, వరల్డ్ చాంపియన్స్, నేషనల్, ఖేలో ఇండియా, నేషనల్ స్కూల్ గేమ్స్ లో పతకాలు పొందిన వారికి ఇచ్చే ప్రోత్సాహకాన్ని భారీగా పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఒలింపిక్స్ లో బంగారు పతకం సాధించిన వారికి ఇప్పటి వరకు రూ.75 లక్షలు ఇస్తుండగా దీన్ని ఇకపై రూ.7 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారని అలాగే రజత పతకం సాధించిన వారికి రూ.50 లక్షలు ఇస్తుండగా ఇకపై రూ.5 కోట్లు, కాంస్య పతకం సాధించిన వారికి ఇప్పటి వరకు రూ. 30 లక్షలు ఇస్తుండగా ఇకపై రూ.3 కోట్లు ఇవ్వాలని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబును తెలియజేశారని అన్నారు. గ్రూప్1 ఉద్యోగాలు , డిఫెన్స్ , రైల్వేస్, బ్యాంకింగ్ ఇతర అన్ని ప్రభుత్వ శాఖలలో కూడా ఉద్యోగాలు సాధించవచ్చని తెలియజేశారు.

కేన్సర్పై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గొలుగొండ:స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం కేన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కీర్తి మాట్లాడుతూ, పొగాకు వంటి వాటితో కేన్సర్ వచ్చే అవకాశం ఉందని, అటువంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ ప్రసాద్, ఎంఎల్హెచ్పీలు పాల్గొన్నారు.

కృష్ణదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యాధికారులు హరిప్రవీణ్, గాయత్రి ఆధ్వర్యంలో కేన్సర్పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.

రోలుగుంట: మండలంలోని బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం కేన్సర్పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు సునీత, శ్రీనివాసరాజులు మాట్లాడుతూ కేన్సర్ పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని చెప్పారు. పొగాకు వంటి వాటితో కేన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు.

అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సరుకులు ఇస్తున్న శివదత్

నిత్యావసర సరుకుల వితరణ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినతీనార్లలో హైవోల్టేజ్తో షార్ట్ సర్క్యూట్తో కోశెట్టి పైడియ్య కు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఈ మేరకు గ్రామానికి చెందిన జనసేన నాయకులు స్పందించారు. ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ గురువారం స్థానిక జనసేన పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, 75 కిలోల బియ్యం, సరుకులు, కూరగాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాము గణేష్, మహేష్, కొడ మహేష్,కంధాల నాగరాజు, ప్రసన్న కుమార్, పిక్కి మహేష్, ఆనంద్,సింహాచలం పాల్గొన్నారు.

నేడు నక్కపల్లి మండల సమావేశం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 8న శుక్రవారం ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి సీతారామరాజు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సర్పంచ్లు హాజరు కావాలని కోరారు. ఆయా శాఖల అధికారులు సంబంధిత నివేదికలతో సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ అధికారి

అంతర్ పంటలతో అధిక లాభాలు

ప్రజాశక్తి -రావికమతం:పామాయిల్ తోటలలో అంతర పంటగా కోకో సాగు చేస్తే రైతులు అత్యధికంగా లాభాలు పొందవచ్చునని ఉద్యానవన శాఖ అధికారిణి భాను పుష్ప లీలావతి తెలిపారు. మండలంలో మేడివాడలో పామాయిల్ సాగు చేసే రైతులకు మెళ కువల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నీడలో పెరిగే కోకోను పామాయిల్ తోటలలో పెంచాలని సూచించారు.పామ్ ఆయిల్ తోటల్లో అంతర పంటగా కూరగాయలు, అరటి సాగు చేస్తే రైతులకు ప్రభుత్వం రాయితీ అందజేస్తుందని, వీటిని సద్వినియోగ పరుచుకోవాలని ఆమె కోరారు. ప్రస్తుతం మండలంలో 249 హెక్టార్లలో పామాయిల్ సాగుతుందన్నారు. ఈ ఏడాది అదనంగా 40 హెక్టార్లలో సాగు చేయించాలని లక్ష్యంగా తీసుకున్నామని ఆమె తెలిపారు.

మరుపాకలో పొలం బడి

ప్రజాశక్తి -రావికమతం: రబీ సీజనకు రైతులు సన్నద్ధం కావాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి డి. రూప గురువారం పిలుపునిచ్చారు. మరుపాకలో పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రబిలో సాగు చేసే పంటలకు విత్తనాలను సేకరించడం, విత్తన శుద్ధి చేయడం పై రైతులు దృష్టి సారించాలని సూచించారు. రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు ప్రభుత్వం రాయితీపై ఇస్తుందని ఆమె తెలిపారు.

పంటల సాగుపై అవగాహన

ప్రజాశక్తి- నాతవరం: మండలంలోని పీకే గూడెం గ్రామంలో పతంజలి కంపెనీ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సాగు పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యానవన శాఖ అధికారి ఎస్.శిరీష మాట్లాడుతూ, ప్రభుత్వం అందించే మొక్కలు, ఎరువులు, బిందు సేద్యం, సబ్సిడీ పథకాలను గురించి వివరించారు. పతంజలి మేనేజర్ తోట చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఆయిల్ పామ్ పంట ఆవశ్యత, దిగుబడులపై వివరించారు. అసిస్టెంట్ మేనేజర్ రమేష్ మరియు ఫీల్డ్ ఆఫీసర్ ఏ.నాగేశ్వరరావు పంట యాజమాన్యంపై వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నేటి నుండి నక్కపల్లిలో రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్

ప్రజాశక్తి- నక్కపల్లి:నక్కపల్లిలో 8వ తేదీ నుండి 10 వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68వ అండర్-14 బాల బాలికల రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్ కం సెలక్షన్స్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎంఈఓ లు కే నరేష్, వేమగిరి నూకరాజుల ఆధ్వర్యంలో జిల్లాలో వివిధ మండలాల నుండి హాజరైన వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లతో సమావేశం నిర్వహించారు. టోర్నమెంట్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో 13 జిల్లాల నుండి 468 మంది బాల బాలికలు ఈ టోర్నమెంట్ లో పాల్గొంటారని తెలిపారు. నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలోనూ, హాకీ గ్రౌండ్ లోను ఈ పోటీలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని, శుక్రవారం ఉదయం పోటీలు ప్రారంభం కానున్నాయన్నారు. పోటీలకు హాజరయ్యే బాల బాలికలకు వసతి సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో హెచ్‌ఎం రాణీలలిత, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధి కె.ఎం నాయుడు, బిఎస్ హాకీ క్లబ్ కార్యదర్శి కొల్నాటి తాతాజీ పాల్గొన్నారు.

ముఖ ఆధారిత హాజరుపై పునరాలోచన చేయాలి

ప్రజాశక్తి -కొత్తకోట:వైద్యఆరోగ్య శాఖలో ముఖ ఆధారిత హాజరు జీతాలతో అనుసంధానం చేయడం పట్ల రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పాతళ రామారావు, కార్యదర్శి కె ఎస్ నరసింహరావు కోరారు. రావికమతం మండలం కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం స్థానిక విలేకర్లతో వారు మాట్లాడారు. కరోనా వంటి విపత్కర సమయంలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలను అందించిన వైద్య ఆరోగ్యశాఖకు ముఖ ఆధారిత హాజరును జీతాలను ముడి పెట్టడం సరికాదని అన్నారు. ప్రభుత్వం ముఖ ఆధారిత హాజరు విషయంలో సానుకూల నిర్ణయాన్ని తీసుకుంటారని ఆశిస్తున్నామని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే ఉద్యోగులుకు సమయ పాలనతో ముడిపెట్టరాదని,ఈ ఉద్యోగులు 24 గంటలూ వైద్య సేవలను అందిస్తూ ప్రజలు ప్రాణాలను కాపాడేందుకు తమ శాయశక్తులా పనిచేస్తారని పేర్కొన్నారు. 24గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఉద్యోగులకు ఈ విధానం ఒక ప్రతిబంధకమవుతుందన్నారు. ప్రభుత్వం నిర్ణయం మేరకు తమ కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు.

తనిఖీ చేస్తున్న సిఇఒ

ఎంపిడిఒ కార్యాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం సాయంత్రం సీఈవో పి నారాయణమూర్తి సందర్శించారు. కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆర్థిక సంఘం నిధులు,తదితర అంశాలపై చర్చించారు. ఎంపీడీవో డి.సీతారామరాజు, ఇంచార్జ్ ఈఓపిఆర్డి ఎం.శ్రీను లతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి

-పలుచోట్ల విఒఎల ఆందోళనలు

నర్సీపట్నంలో ఆందోళన చేస్తున్న విఒఎలు

ప్రజాశక్తి-రావికమతం:విఒఎ మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలంటూ గురువారం వెలుగు కార్యాలయం ముందు వివోఏలు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు రావికమతం సిఐటియు మండల కార్యదర్శి వజ్రపు సత్యవతి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వివోఎల మండల సంఘ అధ్యక్షులు జి. సత్యవతి మాట్లాడుతూ,గత 15 ఏళ్ల నుంచి విఒఎలుగా పని చేయడంతో వేరే పని చేసుకోవడానికి అన్ని అర్హత లు కోల్పోయామన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యమాలు చేపట్టడంతో జీవోను నిలుపుదల చేయడం జరిగిందన్నారు. ఐదు నెలల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించి రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. సిఐటియు మండల కార్యదర్శి వజ్రపు సత్యవతి మాట్లాడుతూ, వెలుగు వివోఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుష్ప ,సత్యవతి, అప్పారావు, ప్రసాద్, రామచంద్రరావు పాల్గొన్నారు.

నక్కపల్లి:3 సంవత్సరాల కాలం పరిమితి సర్క్యులర్ రద్దుచేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని వెలుగు విఒఏ (యానిమేటర్స్) లు డిమాండ్ చేశారు. స్థానిక వెలుగు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని

బుచ్చయ్యపేటలో వినతిపత్రం ఇస్తున్న విఒఎలు

కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వరలక్ష్మి, అన్నపూర్ణ, సత్యనారాయణ, సూర్యనారాయణ, తులసి, నాగమణి పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ :స్థానిక వెలుగు మండల కార్యాలయం వద్ద విఒఏలు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవాధ్యక్షులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ఆదిలోనే మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామన్న హామీని మరచి వివోఏలను మార్పు చేయొచ్చనే విధంగా మంత్రి ప్రకటనలు ఉన్నాయన్నారు. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం హయాంలో సర్క్యులర్‌ను పోరాటాల ఫలితంగా అమలు చేయకుండా నిలుపుదల చేసుకోగలిగామన్నారు. నేడు మరల కూటమి ప్రభుత్వం ఈ సర్క్యులర్ తెరపైకి తేవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. రాజు, రాజ్యలక్ష్మి, లలిత ,లక్ష్మి విఓఏలు పాల్గొన్నారు.

కోటవురట్ల:వెలుగు కార్యాలయం వద్ద వివోఏలు ధర్నా నిర్వహించారు.రాజకీయ వేధింపులను ఆపాలని నినాదాలు చేశారు తహసిల్దార్ తిరుమల బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వివోఏ సంఘ నాయకురాలు మాణిక్యం, వీవోలు పాల్గొన్నారు.

చీడికాడ:మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ వెంటనే రద్దు చేయాలని తహసిల్దార్‌కి విఒఎలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నేత దేముడునాయుడు మాట్లాడుతూ, వివో ఎలు చాలీచాలని జీతాలతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు.

కె.కోటపాడు : వెలుగు విఒఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక వెలుగు కార్యాలయం వద్ద గురువారం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఈ నాయుడు బాబు మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వము ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని. ఐదు నెలల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెలుగు వివోఏలు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని విఓఏలు గురువారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం ఏపీఎంకు వినతి పత్రం అందజేశారు. 3 సంవత్సరాల కాలపరిమితి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 52 మంది విఓఏ పాల్గొన్నారు.

అనందపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వెలుగు కార్యాలయం వద్ద విఒఎలు ఆందోళన చేపట్టారు. ఆనందపురం వెలుగు కార్యాలయం నుంచి ర్యాలీగా

రావికమతంలో...

ఆనందపురం కూడలి చేరుకొని నిరసన తెలిపారు.కార్యక్రమంలో విఒఎలసంఘం మండల ప్రధాన కార్యదర్శి పారుపిల్లి అపర్ణ, మజ్జి శ్యామల,చందక రమణమ్మ,గుడివాడ రమణమ్మ,తమరాడ రమాదేవి, మామిడి దేవి,అడ్డూరి సంతోష్ కుమారి ,పాడ్రింకి సత్యరాజు పాల్గొన్నారు

పెందుర్తి :వెలుగు కార్యాలయం వద్ద విఒఎలు శాంతియుత ధర్నా నిర్వహించారు. విఒఎల సంఘం జిల్లా ట్రెజరర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో ఏ. శారద, జి. రమణి, ఏ. లక్ష్మి, రాజు లక్ష్మి పాల్గొన్నారు. సిఐటీయు నాయకులు కె. అప్పలనాయుడు, ఎన్. ప్రభు దేవా,మహేష్ ధర్నాకు మద్దతు ప్రకటించారు.

పద్మనాభం : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వెలుగు విఒఎలు ఆందోళనలో భాగంగా రెండోరోజు గురువారం వెలుగు కార్యాలయం నుంచి పద్మనాభం జంక్షన్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. మండల అధ్యక్షురాలు పి కంచమ్మ, రామలక్ష్మి మహాలక్ష్మి లీల పాల్గొన్నారు.

భీమునిపట్నం : విఒఎల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెండోరోజు గురువారం వెలుగు కార్యాలయం వద్ద నిరసన కొనసాగించారు. వెలుగు విఒఎల సంఘం సిఐటియు ఆధ్వర్యంలో నిరసనలో సంఘం నాయకులు పార్వతి, వెంకట లక్ష్మి, కల్యాణి, ఎస్ గున్న పాల్గొన్నారు.

పెందుర్తిలో..

బాలికల వసతిగృహంలో సమస్యల పరిష్కారం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - చీడికాడ:మండల కేంద్రంలో బాలికల వెనుకబడిన సంక్షేమ వసతి గృహంలో ఎట్టకేలకు విద్యార్థినుల సమస్యల కు తెరపడింది. ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురించిన "ఒక హాలు వంద మంది

ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి తలుపు

దుప్పట్లు ఇస్తున్న సిబ్బంది

విద్యార్థులు" పేరుతో వచ్చిన కథనానికి వసతిగృహం వార్డెన్ లలిత వెంటనే సమస్యలపై స్పందించారు. విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ వసతి గృహంలో మూడవ తరగతి నుంచి 10వ తరగతి వరకు సుమారు 100 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ వసతి గ్రహంలో మరుగుదొడ్ల తలుపులు ఏర్పాటు చేశారు. దుర్వాసనతో నిండిన సెప్టిక్ ట్యాంకును శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వసతిగృహంలో ఎటువంటి లోటుపాట్లు రాకుండా నిరంతరం పర్యవేక్షణ అందుబాటులో ఉంటూ చిన్న చిన్న సమస్యలు లేకుండా చూసుకుంటామని తెలిపారు

సిపిఎం ఏరియా కమిటీ కన్వీనర్‌గా కె.గోవిందరావు ఎన్నిక

ప్రజాశక్తి -కొత్తకోట:సిపిఎం రావికమతం, రోలుగుంట ఏరియా కమిటీ కన్వీనర్ గా కె.గోవిందరావు ఎన్నికయ్యారు. రావికమతం, రోలుగుంట ఏరియా కమిటీ సమావేశం కోత్తకోటలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నికైంది. ఈ ఎన్నికలలో కమిటీ సభ్యులుగా ఈరెల్లి చిరంజీవి, ఎస్.రాజు, పాంగి చంద్రయ్య, గేమిల రాజు, రామారావు, శ్రీను తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ, ప్రజా పోరు యాత్ర ను జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర ధరలు తగ్గించి, ఉచిత ఇసుక విధానం అమలు చేయాలన్నారు. బి.యన్ రోడ్డు మరమ్మతు చేపట్టాలన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న, కెవిపిఎస్ జిల్లా నాయకులు పూడి అర్జున రావు సిహెచ్ సూరిబాబు, ఎస్ నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు..